# బుజ్జికథలు

నదీరా

ప్రపంచ తెలుగు మహాసభల
సందర్భమున ప్రచురితము

398.2
NAD

ఆంధ్రప్రదేశ్ సంగీత నాటక అకాడమీ

[illegible]

AOVAIOSB 106

A

# బుఱ్ఱకథలు

నదీరా

V.R. NARLA MEMORIAL LIBRARY
V.R NARLA
D P R I.
Acc. No
11445

ప్రపంచ తెలుగు మహాసభల సందర్భమున ప్రచురితము

DR. B.R AMBEDKAR OPEN UNIVERSITY
UNIVERSITY - LIBRARY
N11445

ఆంధ్రప్రదేశ్ సంగీత నాటక అకాడమీ

398.2
NAD
B
A

ప్రచురణ నెం. 22
ఏప్రిల్, 1975

ముద్రణ :
నాట్యకళ ప్రెస్
హైదరాబాదు-500004.

V.R NARLA
D P R L
Acc. No

వెల : రెండు రూపాయలు

ముఖపత్రం : వరఖ శ్రీనివాసశర్మ

ప్రతులకు
ఆంధ్రప్రదేశ్ సంగీత నాటక అకాడమీ
కళాభవన్, హైదరాబాదు-500004

# పరిచయము

ఇరువై శతాబ్దాల తెలుగు చరిత్ర సంస్కృతి పునాదులపైన నిర్మింపబడ్డ తెలుగు జాతి సమైక్యతను సర్వతోముఖాభివృద్ధిని పటిష్ఠం చేయడానికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఆధ్వర్యంలో రాక్షసనామ సంవత్సర ఉగాది (1975 ఏప్రిల్ 12వ తేదీ) నుండి వారం రోజులపాటు ప్రపంచ తెలుగు మహాసభలు జరుగుతున్నవి. ఈ మహాసభల ఏర్పాట్లకుగాను ముఖ్యమంత్రి శ్రీ జలగం వెంగళరావుగారు అధ్యక్షులుగాను, విద్యాశాఖ మంత్రి శ్రీ మండలి వెంకటకృష్ణరావుగారు నిర్వాహకాధ్యక్షులుగాను ఒక సంఘం ఏర్పడింది. ఈ సందర్భంగా 1975 సంవత్సరాన్ని తెలుగు సాంస్కృతిక సంవత్సరంగా పరిగణించడం జరుగుతున్నది.

ప్రపంచ మహాసభలకు నాందిగా రాష్ట్రంలోని పలు ప్రదేశాలలోను, ఢిల్లీలోను సంగీత, నాటక, నృత్య, జానపద కళోత్సవాలను నిర్వహించే బాధ్యతను, ఆయా కళారంగాలకు సంబంధించిన గ్రంథాలను ప్రచురించే బాధ్యతను స్వీకరించవలసిందని ఆంధ్రప్రదేశ్ సంగీత నాటక అకాడమీని ప్రపంచ తెలుగు మహాసభల కార్యవర్గం కోరింది. ఈ కార్యక్రమం క్రింద అకాడమీ విజయవాడలో నాటకోత్సవాన్ని, అనంతపురంలో వీధినాటకం సదస్సును, నిజామాబాద్‌లో నృత్యోత్సవాన్ని, తిరుపతిలో సంగీతోత్సవాన్ని ఢిల్లీలో ఆంధ్రప్రదేశ్ జానపద, నాటక కళోత్సవాన్ని నిర్వహించింది,

ఈ సందర్భంలో సంగీత, నృత్య, నాటక, చలనచిత్రాలకు సంబంధించిన గ్రంథాలను ప్రచురించే అవకాశం కల్పించి, అకాడమీ గ్రంథ ప్రచురణ కార్యక్రమానికి ప్రపంచ తెలుగు మహాసభల కార్యవర్గం దోహదం చేసింది. అందుకు వారికి మేమెంతో కృతజ్ఞులం. ఈ అవకాశాన్ని పురస్కరించుకొని ప్రచురించిన అనేక గ్రంథాలలో ఈ "బుర్రకథలు" ఒకటి. ఈ గ్రంథాన్ని రచించిన నదీరా గారికి మా ధన్యవాదాలు.

జె. బాపురెడ్డి
స్పెషల్ ఆఫీసర్
ఆంధ్రప్రదేశ్ సంగీత నాటక అకాడమీ.

i

# ముందు మాట

ఎన్నో ఏళ్లుగా అనుకొంటున్న ప్రపంచ తెలుగు మహాసభలు జరుగనున్న పర్వ సమయం ఆసన్నమవుతున్నది. ప్రపంచంలోని తెలుగువారి ప్రతినిధుల నందరినీ ఒకచోట సమీకరించవలెనని పెద్దలందరూ కన్నకలలు ఫలిస్తున్న శుభసమయమిది. రాబోయే ఉగాది రెండు వేల అయిదువందల సంవత్సరాల తెలుగు జాతి చరిత్రలో మరపురాని మధుర ఘట్టము కాగలదు.

క్రీస్తుపూర్వం మూడవ శతాబ్దికి చెందిన శాతవాహన రాజుల కాలంనుంచి తెలుగు ప్రజలకు ఒక విశిష్టమైన చరిత్ర ఉన్నది. భారత దేశంలో తెలుగు మాట్లాడే ప్రజలు దాదాపు ఐదు కోట్లకు పైగా ఉన్నారు. హిందీ మాట్లాడే వారి తరువాతి స్థానం తెలుగువారిదే. బౌద్ధపూర్వయుగంనుంచి ఇటీవల బ్రిటిష్ సామ్రాజ్యపరిపాలనా యుగం వరకూ తెలుగువారు పెద్దఎత్తున ప్రపంచం నలుమూలలకూ వలస వెళ్లడం జరిగింది. అట్లా వెళ్లిన తెలుగువారు తమ భాషా సంస్కృతీ సంప్రదాయాలను ఆ యా జాతీయ జీవన విధానాలతో మేళవించి, వాటిని సుసంపన్నం చేస్తూఉన్నారు.

ప్రపంచ తెలుగు మహాసభల ప్రధాన లక్ష్యం తెలుగు ప్రజల, తెలుగు అభిమానుల ప్రతినిధులను ఒక వేదికమీద సమావేశపర్చడం. జాతీయ, అంతర్జాతీయ సాంస్కృతిక రంగాలలో తెలుగువారు చేయవలసిన కృషినిగూర్చి చర్చించి, నిర్ణయించుకోవడానికి, తద్వారా

వివిధ చైతన్య స్రవంతులను ఏకోన్ముఖంచేసి మన సాంస్కృతిక సంబంధాలను దృఢతరం చేసుకోవడానికి ఈ మహాసభలు దోహదకారులు అవుతవి. అంతేకాక ఈ మహాసభలు ఆర్ద్రమైన భావసమైక్యతకు ప్రాతిపదికలై తెలుగు జాతిని సమైక్యం చేయగలవని, ఆ విధంగా జాతీయ అభ్యుదయానికి తోడ్పడగలవని విశ్వసిస్తున్నాను.

1975 ఏప్రిల్ 12వ తేదీన తెలుగు ఉగాది రోజున ప్రారంభమై ఒక వారంరోజుల పాటు జరిగే ఈ మహాసభలలో వివిధ దేశాలనుంచీ, వివిధ రాష్ట్రాలనుంచీ, యునెస్కోవంటి అంతర్జాతీయ సంస్థలనుంచి విచ్చేసిన ప్రముఖులు ప్రతినిధులుగానో, పరిశీలకులుగానో పాల్గొంటారు. ఈ మహాసభల సమయంలో చర్చాగోష్ఠులు, ప్రదర్శనలు, ప్రచురణలు మొదలైన కార్యక్రమాలు జరుగుతాయి. దేశ విదేశాలలోని తెలుగువారి సంస్కృతి, తెలుగు భాషా సాహిత్యాల, కళల అభివృద్ధి, వైజ్ఞానిక సాంకేతిక ప్రగతి మొదలైన విషయాలపై చర్చాగోష్ఠులు జరుగుతవి. తెలుగువారి సాంస్కృతిక వైభవాన్ని వివిధ కోణాలనుంచి ప్రస్ఫుటంచేసే ఒక ప్రదర్శన ఏర్పాటు అవుతున్నది. తెలుగువారి సమగ్ర స్వరూపాన్ని సందర్శించడానికి వీలైన సంగ్రహాలయాన్ని 'మ్యూజియంను' స్థాపించడానికి ఈ ప్రదర్శన బీజభూతమవుతుంది. తెలుగువారి సంస్కృతి నిరూపించే సాంస్కృతిక కార్యక్రమాలు వారం రోజులపాటు సాగుతవి. తెలుగు ప్రజల సంస్కృతీ సంప్రదాయాలను విశదంచేసే ప్రత్యేక సంచికలు తెలుగు, ఇంగ్లీషు, హిందీ, ఉర్దు భాషలలో విడుదల అవుతాయి. ఈ కార్యక్రమాలలో భాగమే ఈ గ్రంథ ప్రచురణ.

తెలుగు ప్రజలు భాష, సాహిత్యం, చరిత్ర, సంస్కృతి, కళలు మొదలైన వివిధ రంగాలలో సాధించిన ఘనవిజయాలను విశదంచేసే గ్రంథాలు అనేకం ఈ మహాసభల సమయంలో విడుదల అవుతాయి.

ఈ గ్రంథాలను రచించి, సకాలంలో మాకు అందించిన రచయిత లందరకూ నా కృతజ్ఞతలు. ఈ గ్రంథాలను ప్రచురించే భారం వహించడానికి ముందుకువచ్చిన అకాడమీల అధినేతలను అభినందిస్తున్నాను. తెలుగు వారి విశిష్టతలను విశదంచేసే ఈ గ్రంథాలు సహృదయు లందరి ఆదరణ పొందగలవని విశ్వసిస్తున్నాను. అయితే, ఇంత మాత్రం చేత నే ప్రపంచ తెలుగు మహాసభల ఆశయాలు సఫలం కాగలవని నేను అనుకోవడంలేదు. చేయవలసినది ఇంకా ఎంతో ఉంది. ఈ మహాసభల సందర్భంగా నెలకొల్పబడనున్న 'అంతర్జాతీయ తెలుగు విజ్ఞాన సంస్థ' మహాసభల ఆశయ సాధనకు పూనుకొనడమే కాక జాతీయ, అంత ర్జాతీయ సాంస్కృతిక సంబంధాలను దృఢతరం చేయగలదని నమ్ము తున్నాను.

జలగం వెంగళరావు
అధ్యక్షులు,
ప్రపంచ తెలుగు మహాసభలు

# గ్రంథకర్త మాట

రామాయణ, భారత, భాగవతాలను బుర్రకథలుగా ఎత్తి వ్రాసి పూర్తిచేసి, పులిస్టాపు పెట్టాక బుర్రకథల జోలికి వెళ్ళడం మానుకున్నా.

ఇన్నాళ్ళకు, ఇన్నేళ్ళకు బుర్రకథల గూర్చి ఈ పుస్తకం వ్రాస్తున్నా. నే వ్రాసిన బుర్రకథలు ఎన్నోవున్నా, బుర్రకథల గురించి వ్రాసిన పుస్తకం-ఇది మొదటిది.

25 సంవత్సరాలుగా బుర్రకథలు చెప్పడం, వ్రాయడం, నేర్పడం-మున్నగు అలవాట్లవల్ల వచ్చిన అనుభవజ్ఞానం, అదియిచ్చిన ఊహాగానం, ఈపుస్తకరచనలోనాకుఅండదండలై నిలిచాయి. మరియు జానపద వాఙ్మయ పరిశోధకుల గ్రంథాలెన్నో మరింత తోడ్పడ్డాయి. ఆయా గ్రంథకర్తలందరికీ నా ధన్యవాదాలు.

కొందరు బుర్రకథ కవులను, వారి కలాలను, కొన్ని బుర్రకథ దళాలను వారి గళాలను-గురించి ఇందులో ఎత్తుకున్నాను. వారు "మేటి" వారని మిగిలినవారు "వోటి"వారనీ అనుకోవడంపొరపాటు.

ఇది కళారంగం. తాడెక్కే-వారిని తలదన్నే వారు, తలదన్నే వారి తలలో జేజెమ్మలని కూడ తన్నేవారు వుంటారనే సంగతి జగద్విదితమే.

బుర్రకథల గురించి వ్రాసిన ఈపుస్తకం చదవడంపూర్తయ్యే సరికల్లా పఠితలు, పరిశోధకులు కూడా బుర్రకథల గురించి మరింత

అవగాహన చేసుకోవాలి, బుఱ్ఱకథల అభివృద్ధికి మనస్ఫూర్తిగా ఆలోచన చేసి తీరాలని నా ఆశ.

రంధ్రాన్వేషణా దృష్టితో గాక, రసాన్వేషణా దృష్టితో దీనిని పఠించ వలసిందిగాను, జానపద స్రష్టలకు అంజలి ఘటించవలసిందిగాను కోరుచున్నాను.

పదాతీతం—భాషాతీతం—భావాతీతం మన జానపద కళారీతుల యందలి లోతుపాతులు. అట్టి వరాలను కాచిబ్రోచి రక్షించుకొని, మన ముందు తరాలకు అందించుకునే బాధ్యతలు మనవి. ఇదే నా మనవి.

—గ్రంథకర్త

# బుఱ్ఱకథలు

## ప్రస్తావన

శ్రీమద్గురు దేవులగు ఆంధ్రబుఱ్ఱకథా పితామహ నాజర్ గారికి నమస్కరిస్తూ—జానపద కళా ప్రదర్శకులకు, పరిశోధకులకు విజ్ఞానపథ మార్గదర్శకులకు, మహాతపస్వులకు ప్రణతుల నర్పిస్తూ ఈ పుస్తక రచన కుపక్రమిస్తున్నాను.

పుస్తకములకు మస్తకములకు వున్న సంబంధమే బుఱ్ఱకథలకు బుఱ్ఱకాయలకు వున్నది.

జాతిలో నిద్రించిన నీతిని, నిజాయితీని, గుంజి, కుదిపి, వూపి, నిద్రలేపేందుకు బుఱ్ఱకథ ఒక మహత్తరమైన సాధనం.

ఇందు—ముగ్గురు వ్యక్తులు కలసి, ఒక శక్తిగా వెలసి ఘనంగా ఆలపిస్తూ అందు కనుగుణంగా అభినయిస్తూ కథానిధులను సుధానదులుగా చేసి శ్రోతలను ఆనందింప చేస్తారు. కర్తవ్యాన్ని నిర్దేశించి కార్యోన్ముఖులను చేస్తారు.

అనాదిగా వస్తున్న హరికథలకు, బుఱ్ఱకథలకు పునాది ఏదీ అంటే యక్షగానమే. అంతేకాదు. అనేక జానపద కళాప్రక్రియలకు "అమ్మ" వంటిది యక్షగానం! కనుక యక్షగానం గురించి ముందుగా తెలుసుకుందాం.

యక్షగానము

యక్షగానమును ఎందరో ఎన్నో విధాల నిర్వచించారు. కాని ఎల్లరూ ఏకాభిప్రాయానికి రాలేకపోయారు. కనుక అన్నిటినీ ఇచ్చట పేర్కొనడం అనవసరం. అయినా సమగ్రమగు యక్షగానానికి సంగ్రహమగు నిర్వచనాన్ని తెలుసుకోవడం అవసరమే!

యక్షగానం గురించి వ్రాస్తూ 'జక్కి' పదప్రయోగ విచారణ చేస్తూ వాఙ్మయాధ్యక్ష శ్రీ వడ్లమూడి గోపాలకృష్ణయ్యగారు—

"జక్కులు బహువచన రూపంచూస్తే దాని ఏక వచనరూపం విస్తృత వ్యవహారంలో లేకపోయినా 'జక్కి' వున్నదని స్పష్టపడుతుంది.

......జక్కి అంటే 'కట్టువడిపోవటం' అని తెలుగులో అర్థం వున్నదని పేర్కొన్నాను. దాని మూలరూపమైన 'యక్ష' శబ్దానికి కూడా 'కట్టి వేసేవాడు' అని అర్థం వున్నది. వివిధ విద్యలతోపాటు నృత్యగానాది విద్యలతో కూడకట్టి వేయగలవారు. కాబట్టి వారికి యక్షులన్న పేరు వచ్చివుండవచ్చు."

అని వ్రాశారు. అదే మన యక్షగాన కవులు, ప్రదర్శకులు చేశారు. ప్రేక్షకులు, పరీక్షకులు చూశారు.

ఈ సత్యానికి సాక్ష్యంగాను,
ఈ నిజానికి నిదర్శనంగాను,

కందుకూరి రుద్రకవి రచించిన "సుగ్రీవ విజయము" అను యక్షగానము నిలుస్తుంది.

**సుగ్రీవ విజయము**

సవాలక్ష పుష్పాలున్నా సంపెంగ సంపెంగే! యక్షగానాలెన్నోవున్నా ఎన్నికైన తొలియక్షగానం మాత్రం సుగ్రీవ విజయమే.

ఎందువల్లనంటే 'రారా' యుద్ధాని కనగానే 'పోరా' అని ఒక్క పోటు పొడిచాడట వాలి! కదనాన్ని యథాతథంగా ఎలా గ్రథనం చేశాడో చూడండి కవి—

"దినకర తనయుండు దేవేంద్ర తనయు
నని సేయ బిలచిన నా యింద్రసుతుడు
కినుకతో వచ్చి సుగ్రీవుని ఱొమ్ము
తన ముష్టిఁ బొడచినఁ దపననందనుడు
జడియక యొక మహాశైల శృంగంబు
వడిమీఱ గొనివచ్చి వాలిపై నైవ
... ... ... ... ... ... ...
... ... ... ... ... ... ..."

ఇది వాలి సుగ్రీవుల యుద్ధం. వారిద్దరూ అచ్చుమచ్చు ఒకేలా వుండటంవల్ల—పేరులు వేరైనా తీరు లొకటే కావడంవల్ల—వాడి బాణాన్ని వేసేందుకుగాని, వాలిప్రాణాన్ని తీసేందుకుగాని శ్రీరామచంద్రునకు వీలు చిక్కలేదు. ఈ కదనాన్ని వర్ణిస్తూ-తన కవనాన్ని వర్షిస్తూ, వారు కదనం చేసినట్టు, తాను కళ్ళారా చూసినట్టు, ఉన్నది ఉన్నట్టు, కళ్ళకు కట్టేటట్టు మనసుకి పట్టేట్టు మరపుకి రానట్టు 'కందుకూరి రుద్రకవి' ఎంత మనోహరంగా చిత్రించాడో చూడండి.
అట—వాలి సుగ్రీవులెలా వున్నారట—

"ముక్కులు చెక్కులు మూపులు వీపుల్
ప్రక్కలు పిక్కలు బరులును దరులున్
స్వరములు శిరములు జానులు వీనుల్
కరములు నురములు కాళ్లును వ్రేళ్ళున్
ఎక్కువ తక్కువ లింతయు లేకన్
ఒక్కరూపమున నున్నవి చూడన్"

ఇక్కడ విశేష మేమి టంటే కదనరంగాన్ని మక్కికి మక్కీ కాపీకొట్టి కదనరంగంలోకి దించి వదిలాడు కందుకూరి రుద్రకవి. మరి కవిత్వమంటే ఇది. ఇంతకంటే—

ఇదే కవిత్వమంటే-తార కన్నీటి ధారను తన కవితాధారగా మార్చిన వర్ణన! ఇది త్రిపుట అనబడుతుంది—ఇందులో తార కన్నీటి బొట బొట కనబడుతుంది!

సీత నుండి వేరై శ్రీరాముని గుండె నీరై పోయింది, కాని, వాలినుండి వేరై అతడి అలి గుండె చీరుకు పోయింది. ఆమె మాటలే ఆమె గుండె బీటలు. రాముడితో అంటోంది వినండి—

"అలి చెరగొని పోయినట్టి దశాస్యుడుండగ
నిర్నిమిత్తము వాలి నేటికి చంపితివి
రఘువంశ తిలకా!

ఇట్టి సాహస కర్మ మెచటికి నేగె భరతుడు
సీమ వెడలఁగొట్టి రాజ్యము పుచ్చు
కొన్నెడ కువల యేశా!

నాయమేటికి తప్పితివి రఘునాథ! జానకి
తోడనే చెలబోయెనే నీ రాజనీతియు
భూరి మతియున్?

పుణ్యపాపము లెరుగ వెక్కడి భూవరుండవు
నీవు తలుపగ గణ్యుడవె గుణహీనుడవు
నీ ఘనత యెంత?

ఎన్న నెటువలె బుట్టినాడవొ యినకులంబున
నకట నిను రాజన్న దోషము వచ్చు
హరి హరి యనగ విన్నన్"

పిడుగును పిడికిట పొడిచి పిండి చేయగల మహా బలశాలి వాలి రామబాణంతో కూలిపోయాడు. పుడమిపై వాలిపోయాడు. బాణం తగిలింది. ప్రాణం మిగిలింది. బాణం గుండెలో వుంది. ప్రాణం బొందెలో వుంది. బాణం తీస్తేగాని ప్రాణం పోదు. చావు బ్రతుకుల పొలిమేరలో గిలగిలలాడుతూ వాలి-చంపించిన సుగ్రీవునిపై జాలి-చూపుతున్నాడు. ఎంత చిత్రం!

"వగపేల సుగ్రీవ! వైరమెల్లను దీరె
జగ మెరుంగగ రామచంద్రునిచే నిపుడు
రమ్ము సూర్య తనూజ! రాజులను మదిలోన
నమ్మకుము వారి మన్నన లస్థిరములు
రామ విభుతోడ మునుపేమి చేసెద నంటి
నా మాట చెల్లించి యతని కృపనొందు"

"నీవన్న మాట నిలబెట్టుకో. నేనన్న మాట చెవిసెట్టుకో. లేదా నేడు నన్ను చంపాడు. రేపు నిన్ను చంపుతాడు రాముడు" అంటూ వాలి తాను కన్నుమూస్తూ తమ్ముడ్ని కన్నులు తెరువమనడం, పిమ్మట అప్పగింతలు 'నాకు మారుగా, నా కుమారుని నీకుమారునిగా చూచుకో. అంగదుని యెడల పితృభావాన్ని నెరపు. శతృభావాన్ని నెరపకు'మనడం ఇత్యాది ఘట్టముల వర్ణనకు బండరాళ్ళు సైతం కరగి ద్రవించిపోతాయి.

"దినక రాత్మజ! నాకు దేవేంద్రు డిచ్చె నీ
కనక మాలిక దొల్లి కడుసంతసిల్లి
ఇది గళంబున దాల్చి యెల్ల కపిరాజ్యంబు
పదిలుండ వై యేలు బహువత్సరములు
అంగదుడు బాలకుం డరయ డేమియు నంత
రంగమున దయయుంచి రక్షింపు మితని,

మా నేరమును దలచి మదిలోన గోపింప
కీనిసువు నీడేర్పు మితడె నీ సుతుడు"

ఇచ్చట కపిరాజు అశౄవులను కవిరాజు అక్షరాలుగా మార్చి, పంక్తులుగా తీర్చి, పుటలుగా పేర్చి, గ్రంథంలో బంధించి మనకందించాడు. ఈ రుద్రకవిని ఆ రుద్రకవి సమీక్షిస్తూ సమగ్రాంధ్ర సాహిత్యంలో 'యక్షగాన పుష్పాలెన్నో వున్నా తొలి యక్షగాన ఫలం మాత్రం సుగ్రీవ విజయమే'ననడం జరిగింది.

కందుకూరి కవిత్వాన్ని కవిత్వంతోనే శ్లాఘించాడు — ఆంధ్ర కవితా పితామహ అల్లసాని పెద్దన.

అనాదిగా వస్తున్న మన బుఱ్ఱకథల పునాది ఇంత పురాతనమైనదీ, పూజనీయమైనదీ నన్నమాట!

అయితే యక్షగానాలకు బుఱ్ఱకథలకు మధ్య జంగం కథలను మనం విధిగా చెప్పుకుతీరాలి. వీటిని వదలి ముందుకు వెళ్ళడం మనతరం కాదు. ఇవి మనకంటే ఎంతో ముందున్నాయి ఎప్పుడూ ముందుంటాయి కూడా. అక్షర మక్షరం ఎత్తి ముద్దు పెట్టుకోవాల్సిన అద్భుతమైన కవిత్వాలు ఈ జంగం కథలలో వున్నాయి. అసలు — జంగం కథలు చాలా వున్నాయి.

**జంగం కథలు :**

ముగ్గురు మరాఠీలు
కాంభోజరాజు
పెద్ద బొబ్బిలిరాజు
కామమ్మ కథ
కాటమరాజు కథ

సర్వాయ పాపడు

దేశింగురాజు కథ

భల్లాణరాజు కథ

శ్రియాళ కథ

బాలనాగమ్మ కథ

ద్రోణ పర్వము

విరాట పర్వము

రామాయణము

ఇత్యాది జానపద, చారిత్రక, పౌరాణిక కథలెన్నో జంగం కథలుగా వచ్చాయి. వీటికి ప్రజలలో ఆదరాభిమానాలూ హెచ్చాయి.

వీటిలో ధేనువకొండ వెంకయ్య విరచితమగు 'విరాట పర్వము, అడిగోపుల వెంకటరంగయ్య విరచితమగు 'ద్రోణ పర్వము' కథకునికి కావలసినంత అభినయావకాశమును, వంతలకు కావలసినంత వాయిద్యావకాశమును ప్రసాదిస్తాయి.

ఇది చేయి తిరిగిన రచయితలు కాని చేయలేని పని. జంగం కథకు, బుఱ్ఱకథకు, 3 బుఱ్ఱలూ ముఖ్యం.

విరాట పర్వంలో ఈ 3 బుఱ్ఱల (మెడమీది బుఱ్ఱ తంబురా, మెడలోని బుఱ్ఱలు గుమ్మెటలు) ప్రాముఖ్యము వివరించబడింది. ఇది మున్ముందు తెలుసుకుందాం.

ద్రోణ పర్వం — ఇది ఒంగోలు తాలూకా వుల్చిగ్రామం, చప్పిడి పున్నయ్యచౌదరికి అంకితమీయబడింది. కథ ఇలా మొదలవుతుంది.

శ్రీ గంగాధర పుల్చి పురవరా
  శ్రిత జనమందారా
భోగి భూషణా పూజిత చరణా
  పురహర భవతరణా
నాగాసుర మద భంగశుభాంగా
  నగసుత వామాంగా
ఆగమ వందిత సకలా మరనుత
  యభవ భువన విహితా

ఇది మూడుగంటల మూడు నిమిషాలకు సరిపడా వ్రాసిన కథ కాదు. ఎన్ని పూర్తి రాత్రులు పడుతుందో చెప్పిచూస్తే నేగాని చెప్పలేం. కడలిని మథిస్తే ఏకాస్తో అమృతం సిద్ధించిందిగాని ఈకథను మథిస్తే ఎంతో జ్ఞానామృతం సిద్ధిస్తుంది. ఇందుకు చాలా ఓర్పునేర్పు అవసరం.

కథకోసం కవిత్వంగాని, కవిత్వంకోసం కథకాదు. కవిత్వం బాగా వచ్చినచోట కథ వ్రాయడం, రానిచోట వచనంతో సరిపెట్టి మళ్ళా వచ్చినచోట కథనెత్తుకోవడం—ఇత్యాది చేవ తక్కువ కనులు ఈ కథలలో కానరావు— ఏక దమ్మున మొత్తం కథను ఎత్తి వ్రాసి పారేయడము తప్ప!

నిడిగంటి వీరయ్య విరచితమగు 'దేశింగురాజు' కథలో ఆ ఱేనిని యుద్ధ రంగానికి సాగనంపుతూ ఆయన రాణి—

"ఘన విక్రమమున దండున జొచ్చి
  గ్రక్కున మీరలును
ముందు నరుకునను పుడమిని బడినను
  ముఖ్యంబున నేను

సందేహము లేకను చేసెదను
సహగమనము నేను
వెన్నుపోటుచే ధరకూలిన మిము
కన్నులతో కనను"

ఇందు అర్ధాంగి అన్న పదానికి అర్థం ఎంతో ముద్దుగా వుంది. కాని ఆ రాణి సమయోచితంగాను, సమరోచితంగాను మాత్రం అనలేదు. దేశింగు పడిపోవటం ఆయన దహనం—ఆవిడ సహగమనం-ఇత్యాది మాటలు ఆ సమయంలో అనరానివి. వినరానివి. కాని, కవి కావాలనే యిలా పలికించాడు. అర్ధాంగి పలికిన అమంగళం ఆదిలోనే హంసపాదును సూచిస్తుంది. ఇల్లాలి భావన లాగే ఇలవేలుపు దీవెన కూడా—

"కటువగు దేవుని మెడలో హారం
బట తెగి భువి పడెను
పటపటమని గోపుర శిఖరంబులు
పడెను భూమియందు
గ్రక్కున స్వామి యు ముఖమును పడమటి
దిక్కు త్రిప్పెనటను"

ఈ విధంగా సింబాలిజమ్‌తో రానున్నదీ, కానున్నదీ తెలియజేయడం కథనంలో ఒక చక్కని మలయ పవనం!

నాజర్ పల్నాటి యుద్ధం బుఱ్ఱకథలో బాలచంద్రుని యుద్ధరంగానికి సాగనంపుతూ—

"పొమ్మన్నది మాంచాల తిరిగి తా
రమ్మని యనలేదా!"

ఇటువంటిదే!

* * *

గంజి నాగదాసు రచించిన 'శ్రీయాళ మహారాజు చరిత్ర' జంగం కథలో—శ్రీయాళుని, అతడి శ్రీమతి దేవమణిని శివుడు పరీక్షిస్తున్నాడు. కడకు ఆ పరీక్ష 'కొడుకు మాంసాన్ని మీరుకూడా తినాలి. నేను కనాలి. మీరు తింటేనే తింటా. మీరు తినకుంటే నేనూ తిననంటా' అనేంత వరకూ వస్తుంది. ఈ ఘట్టంలో కన్నవారికే కాదు విన్నవారికీ ఏడుపొస్తుంది. పాపమా కన్న తల్లిదండ్రులు—

"కన్న కొమరుని మాంసము తిందురె
కన్న తల్లిదండ్రి"

అని కన్నీరు మున్నీరుగా విలపిస్తారు. ఇచ్చట ఆ తల్లి దండ్రుల- గుండెల విలవిల—మనసుల గిల గిల—కన్నుల జలజల కవిత్వంతో పట్టి మనకళ్ళముందు పెట్టాడు కవి.

'భల్లాణ రాయకథ' కిలారి బ్రహ్మయోగిచే రచింప బడింది. ఈయనది—కమ్మకులము, కమ్మని కలము. కట్టోజి వీరాచారికూడా ఇదే కథను పదముగా వ్రాయడం జరిగింది. భల్లాణ రాయకథనే 'మిండ జంగం' కథ అని కూడా అంటారు.

కలం ఒక్కరిది. ఫలం పెక్కురుది. రచన ఎవరిదైతేనేం? రసాస్వాదన ఎల్లరిదీను!

"శ్రీకరముగ నీలోకము లోపల
సింధు కటక మనెడి
పాక శాసనుని నగరికి సరియగు
పట్న మొకటి కలదు"

ఆ రాజుకు చల్లమదేవి, మల్లికాదేవి అని ఇరువురు రాణులు. గురువు వశిష్ఠుడు. గురువు చెప్పినా వినక శిష్యుడు ఒక వ్రతం

పట్టాడు. ఎక్కడ, ఎప్పుడు, ఎవరు ఏమి కోరినా (జంగాలు) ఇస్తానని, లేదా చస్తానని.

కవి సిద్ధహస్తుడు; గనుక చెప్పదలచుకున్నది సూక్ష్మంగా, సూటిగా, నీటుగా, ఘాటుగా పదాలను గుప్పించి భావాలను చొప్పించి అందర్నీ ఒప్పించి మెప్పిస్తాడు.

"అడుగక పోయిన జంగమునకునే
    పెడుదును ఒక వొట్టు
అడిగిన లేదని నుడివితి నైనను
    నాకగు ఆ పట్టు
ఇష్టముగా ఈ విధముగ చాటుడి
    అష్టదిక్కులందు
కట్టుడి పట్నపు మొగసాలను ఒక
    ఘంట వేగ మందు"

సరే! ఆ ఘంట కట్టబడింది. అది నిత్యమూ కొట్టబడింది. అంటే మ్రోగడమే కాని ఆగడమే లేదు. ఈని చేయి సాగడమే కాని దాగడమే లేదు. ఈయనని పరీక్షించేందుకు ఈశ్వరుడే 'మిండ జంగం' రూపంలో వచ్చేడు. ఈతడు జగన్మోహనాకారుడు. ఈతడిని గాంచిన స్త్రీలు (వారకాంతలు)—

"మారు డేమొ ఈ శూరుడు జారుడు
    వేరే ఎవ రనుచు
మారుడై తె ఈ వరుని చేతులో
    చెరకు విల్లు ఏదీ!
ఇంతులార ఇత డింద్రుడేమొ మే
    నంతయు చూడండి

కాంతలార ఇత డింద్రుడై తె వెయి
కండ్ల కాంతు లేవి?"

చక్కని చమత్కారం. కవి రసికుడు. రసజ్ఞుడు. కథా ఘట్టాల కనుకూలంగా కవిత్వ ధోరణి నల్లేరు మీద బండిలా సాగిపోతూ వుంది.

బయల్దేరిన మిండ జంగం 'ఈనిని' చేరాలి ఆతడి 'రాణి'ని కోరాలి. 'భర్తనుంచదు భార్య పొందు' ఈ మలుపు దగ్గరకి కథని నడుపుతూ మారువేషంలో వున్న శివుడు ముందుగా ఆ రాజుగారి మంత్రులతో భేటీ వేసుకుని వారి మతులు పోగొట్టేస్తాడు.

"మంత్రులారా! ఈ రోజు, మీ రాజు, నా మోజు తీర్చాలి. నేను జారుణ్ణి—

"జారుడిగా చరియించకపోతే
ధారుణి ఘన తేమి!
ఇంద్రియముల సుఖమంద జేయుచే
ఇంద్ర చంద్ర పదవి!"

ఇలా మంత్రులతో అయిన పిదప మహారాజుకే తన మోజును తెలియపరుస్తాడు. ఇంతకుక్రితం వచ్చినవారు ఈదానం ఆదానం అడిగారుగాని, ఇలాటి దానం ఎవరూ అడుగలేదు. ఈయన ఏ దానం అడిగా డంటా రేమో-

"అన్నముపై నా కాసలేదు నా
చిన్న మనవి వినుమా
వెన్నెల తేటకు మించిన మంచిది
కన్నియ కావలయు
మంజుల భాష సమంచిత రంజిత
కంజ పత్ర నేత్ర

లంజ లేంది వేయి లంచమిచ్చినను
గంజిపోదు నాకు!"

'పద్మినీ జాతి స్త్రీ కావాలి' అని చాలా పచ్చి పచ్చిగా అడి గేస్తాడు శివుడు. రాజు తన భటులను వేశ్యావాడకు అట్టి స్త్రీకోసం వెదుక బంపగా శివుని మాహాత్మ్యంవల్ల వెలయాలు దొరుకదు.

పరీక్షించేందుకు వచ్చేడు కాని నిరీక్షించేందుకు రాలేదు పరమ శివుడు.

చివరకు గతిలేక వెలయాలికి బదులు తన యిల్లాలినే, బజారు సానికి బదులు తన పట్టపురాణినే మిండ జంగానికి సమర్పిస్తాడు భల్లాణ రాజు.

"నీల కంఠుడా నెలతను కనుగొని
కలగక చిత్తమున
ఫాల లోచనుడు పవ్వళించె నట
పలుకు లేమిలేక
'తల్లి ప్రక్కలో తనయుని రీతిగ'
మెల్లగ పవళించె"

చివరకు భక్తుడు నెగుతాడు. భగవంతుడు ఓడిపోతాడు. తత్కారణంగా భల్లాణుడు ప్రమథగణాలకు సైతం ప్రభు వవుతాడు. ఇదీ కథ. ఈ కథ గురించి ఇంతగా ఎందుకు చెప్పవలసి వచ్చిందీ అంటే—ఈ కవి ధార పంచదార! ఈ కథ జంగం కథల్లో ధృవతార! కథ యింత యిదిగావున్నా రక్తి కడుతుంది. శ్రోతల్లో భక్తి పుడుతుంది. ఇది ఈ కథలోగల విశేషం.

సర్వాయ పాపడు కథ - కవి పేరు తెలవదు.
"ఊర పిచ్చుక ఊరు చేరదు

పొట్టి పిచ్చుక పాలము చేరదు
కౌజులు కారాడు చుండు
నక్కలు నాట్యాలు ద్రొక్కును
పంది కొక్కులు డోలు కొడ్తాయో
దొంతి కుండలు గంతు లేస్తాయో"

పాపయ్యా పేరు చెప్తేచాలు. పై సంఘటనలు తప్ప వట ! ఇదే బాణీని నాజర్, అగ్గిరాముడు సినిమాలో 'సీతారామ-రాజు' బుఱ్ఱకథ చెబుతూ వాడడం జరిగింది. తెల్లదొర తనం 30 ఎక రాల మాగాణీని తనకు లంచం యిస్తాననగా అందుకు రామరాజు--

"అట్టి మాటలు విన్న రాజు
ట్లగ్గి పిడుగై భగ్గుమంటు
పట్టి మీసం పట్టి దువ్వాడా - నారాయణ
మీ లంచమును చేకుట్ట నన్నాడ"

అని మండి పడతాడు. ఈ బాణీ శ్రోతలను ఎంతో ఆకర్షి-స్తుంది. ఈ బాణీలో వంతలు 'నారాయణ' అనిగాని, 'వహ్వారెవహ్వా' అనిగాని, 'సాసామి రంగ' అనిగాని, "భళిరన్నభాయి' అనిగాని అన వచ్చు.

ఎరుకల నాంచారి కథ — కవి రుక్మాభట్ల విధుమౌళి శర్మ. వ్రాశామంటే వ్రాశామన్నట్లుగాక ఏ మాట వేసినా, ఏ పాట వ్రాసినా ఎనలేని రసపోషణ చూపగల దిట్ట. కళాస్రష్ట. ఈయన వ్రాసిన తదితర తందనాన కథలు తెలంగాణా అంతటా తేనెల వాన లను కురిపించాయి.

తెల్లాకుల వెంకటేశ్వర గుప్త రచించిన రామాయణం 'తెలుగు-మాట = తేనె తేట + వెలుగు బాట' అని ఋజువు చేస్తుంది.

జంగం కథలను చెప్పటంలో రెంటపాళ్ళ గుడ్డి జంగం (కోటి వీరయ్య), దొడ్డారపు వెంకటస్వామి మున్నగు ప్రముఖులు తమ యావచ్ఛక్తినీ ధారవోసి 'విద్యుచ్ఛక్తి కన్న విద్వచ్ఛక్తి మిన్న!' అని నిరూపించారు. కథలు చెప్పి తమ ప్రతిభను కథల్లి చెప్పుకునేటట్టు చేశారు.

**బుఱ్ఱకథల పుట్టుక**

బుఱ్ఱకథ పుట్టుక గురించి తెలుసుకుందాం. భూమి మీద మనిషి పుట్టిన నాడే బుఱ్ఱకథ పుట్టింది. బుఱ్ఱ లేకుండా ఏమనిషీ పుట్ట లేదు. బుఱ్ఱ ఎప్పుడైతే వుందో ఆ బుఱ్ఱకి ఓకథా అప్పుడే వుంది. ఆ బుఱ్ఱలో పుట్టినవే ఈ బుఱ్ఱ కథలన్నీ.

యక్షగానం తల్లి అయితే జంగం కథ, బుఱ్ఱకథ కవల పిల్లలు!

జంగం కథలు జంగాల ఉదరపోషణకు, జానపద కళారీతుల మధుర పోషణకు దోహదం చేశాయి. అవే రాగ తాళ గీత నృత్యాదుల వన్నె చిన్నెలతో బుఱ్ఱకథలై పురోగమించాయి.

"మత్తును వదిలించి బుఱ్ఱలను మరమ్మత్తు చేసేందుకు బుఱ్ఱ కథలు పనికిరావాలి. అలా బుఱ్ఱకథలు చెప్పడం మనకి రావాలి" అనే మహోదాత్తమైన ఆశయంతో నాజర్ వంటి ప్రముఖులు విశేషంగా కృషి చేశారు. అట్టి ప్రముఖులెందరి కృషివల్లనో బుఱ్ఱకథ ఒక మహోధృతమగు ప్రచార సాధనమైంది. బుఱ్ఱకథకు పునాది యక్షగానం. ఇది నిర్వివాదాంశం.

అంచెలంచెలుగా బుఱ్ఱకథను ఉట్టి అభ్యుదయ లక్ష్య శృంగాలవైపు నడిపించిన అపూర్వ కళాస్రష్టలకు జోతల నర్పిద్దాం. బుఱ్ఱకథలను పుంజా పుష్పాలుగా జేసి కళామతల్లిని అర్చిద్దాం.

ఇక బుర్రకథలో 'బుర్ర'యొక్క ప్రాముఖత్యనుగూర్చి తెలుసుకుందాం.

బుద్ధి లేనివారిని బుఱ్ఱలేనివారు అంటాము. బుద్ధికి బృహస్పతి అంతటివాడిని 'అబ్బో! ఆయనది చాలా గొప్ప బుఱ్ఱ!' అంటాము. వేమవరం వెళ్ళి వచ్చిన వుల్లయ్యలని బుఱ్ఱ తక్కువ వాళ్ళు అంటాము. బుఱ్ఱలను కదిలించేందుకు గుఱ్ఱులను వదిలించేందుకు బుఱ్ఱకథను సృష్టించుకున్నాడు మానవుడు. బుఱ్ఱలను ప్రయోగించేది, బుఱ్ఱలను ఊగించేది బుఱ్ఱకథ. 'బుఱ్ఱకథ' అనే నాలుగక్షరాలలోను 'బుఱ్ఱ' అనే రెండక్షరాలకే ఇంత చరిత్ర వుంది. బుఱ్ఱగల వ్యక్తికి భూమ్మీద అసాధ్యమనేదేలేదు. మరయితే ఒక్క బుఱ్ఱగల వ్యక్తే అంత గొప్పవాడయితే పది బుఱ్ఱలుగల తానెంత గొప్పవాడినో! అని నిక్కినీలిగాడు రావణాసురుడు.

ఒక్క బుఱ్ఱగల హనుమంతుణ్ణి పెక్కు బుఱ్ఱలుగల రావణుడు లంకలోకి ఎందుకు ప్రవేశించావ్? "లంకిణిని ఎందుకు సంహరించావ్? పలుకవేమిరా బుఱ్ఱలేని కోతీ?" అని తూలనాడాడు. హనుమంతుడు విన్నాడు. తన ఆగ్రహాన్ని త్రొక్కిపట్టాడు. దశకంఠుడి బుఱ్ఱలను లెఖ్ఖపెట్టాడు. లెఖ్ఖపెట్టి—

"బుఱ్ఱలే రెండైదులున్నా
బుద్ధి మాత్రం నీకు సున్నా!
అరే అంటా వెవడురా నువ్వు?
శ్రీరామ బంటును
ఒరే అంటా వెవడురా నువ్వు?
కోతి యంటూ ప్రేలితివి నీ
మూతిపై తన్నెదను కానీ

రాముడికి నిన్నప్పై పెట్టాను
నేపోయి వెంటనె
రాము నిపుడే పట్టుకొస్తాను!"

"నీకు బుఱ్ఱ వుందిగాని బుద్ధిలేదు. నేను కోతి ననుకుంటు న్నావుగాని నీపాలిట యమదూతను. నీ బుఱ్ఱలు సర్వం దండగ. వాటిని పుచ్చేలవలె ఎగురగొట్టిననాడే పండగ!" అంటాడు హను మంతుడు.

(పై పదం 'సంపూర్ణ రామాయణం' బుఱ్ఱకథలోనిది. గ్రంథ కర్త నదీరా. ప్రచురణకర్త రామభక్త శ్రీ లింగా నాగభూషణం గుప్త, మహాంకాళి స్ట్రీట్, సికిందరాబాద్).

హనుమంతుడి మాటల్నిబట్టి ఆనపకాయంత బుఱ్ఱ వుండీ ఆవ గింజంత బుద్ధి లేకపోతే ఆ బుఱ్ఱ బుఱ్ఱకాదు, వట్టి డొల్ల అని స్పష్ట పడుతోంది.

అట్టిదిగాక, చక్కగా యోచించగల బుఱ్ఱలు మూడు బుఱ్ఱ కథకి చాలా ముఖ్యం.

అయితే ఇంతకీ ఇట్లాటి బుఱ్ఱకథ ఎక్కడ పుట్టిందన్నమాట? బుఱ్ఱలోనే! బుఱ్ఱలోపుట్టి భూమ్మీదికి దిగుమతి అయింది. అందువల్ల బుఱ్ఱకథకి బుర్రపుట్టినిల్లయితే భూమి మెట్టినిల్లు! కాదంటారా?

**బుఱ్ఱకథ ఆకర్షణ**

బుర్రకథ అవతరణను గురించి తెలుసుకున్నాం. ఇక బుర్ర కథ ఆకర్షణను గురించి తెలుసుకుందాం.

రాగ తాళ నృత్యాదుల వన్నెచిన్నెలతో బుర్రకథ పండిత పామరులను సమంగా ఆకర్షిస్తుంది. మూడు బుర్రలను పలికిస్తూ ముగ్గురు ఆలపిస్తారు. ముచ్చటగా అభినయిస్తారు.

కమ్మని కథాగాన లాస్యం, హాయిగా నవ్వించే హాస్యం, తీయగా కథను వివరించే భాష్యం-ఇత్యాది సూదంటు రాళ్ళవల్ల బుర్రకథ అశేష జనాకర్షణను పొందగలిగింది. ఇది విన విందు, కన విందు గనుక ముందు వెనుకల యందేగాక నాల్గు ప్రక్కలయందు కూడా జనం కూర్చునేందుకు వీలుంది.

ఉత్సవాలయందుగాని, ఉపన్యాసాల ముందుగాని (పిమ్మట కూడా) బుర్రకథలను వింటుంటాం. ఎన్నికల్లో ఎలాగూ తప్పవు.

ఎందువల్లనంటే బుర్రకథ అనేక బుర్రల్ని 'gather' చేస్తుంది. అంటే ప్రోగు చేస్తుంది. అంతేకాదు బాగు చేస్తుంది. సభానంతరం బుర్రకథ వుందీ అంటే జనం విరగబడిపోతారు. ఉపన్యాసం ఎలా వున్నా బుర్రకథకోసం వుండిపోతారు జనం. ఎంతకి ఉపన్యాసం తెమలక, జనం విసిగి లేచిపోయారనుకోండి. అప్పుడు ఉపన్యాసకుడొక మంత్రాన్ని ప్రయోగిస్తాడు. "కూర్చోండి! కూర్చోండి! బుర్రకథవాళ్ళు వేషాలు వేసుకుంటున్నారు అంటే చాలు జనం చక్కగా కూర్చుంటారు. కూర్చున్న జనాన్ని మళ్ళా లేక గొట్టేస్తాడు ఉపన్యాసకుడు. ఏమైనా బుర్రలు మ్రోగేసరికి వెళ్ళిపోయే జనం వెనక్కి తిరిగి చక్కావస్తారు.

అర్ధరాత్రి ఏ 12 గం॥ కో దళానికి స్టేజి యిచ్చేసరికి దళం వారి స్టేజి ఎలా వుంటుంది? సెంటర్‌కి 'జోగులమ్మ' ఎంట రవుతూ వుంటుంది. వంతలకి ఆవులింతలు వస్తూ వుంటాయి. గుమ్మెటలు కొట్టాలి. గుబ్బలు వదలగొట్టి బుబ్బలు కదలగొట్టాలి. చక్కగా కథ చెప్పి సభను రంజింపజేయాలి. ఈ విధమైన సాధక బాధకాలు బుబ్బకథ దళాలకేమీ క్రొత్తకాదు. ఏమైనా అందరికీ నచ్చేదీ, అందరూ మెచ్చేదీ బుబ్బ కథ. ఇది జనాకర్షణ విషయంలో సూదంటురాయి!

జానపద కళారీతుల్లో మైలురాయి! సంస్కృతీ నాగరికతలకు సాన రాయి! అనడంలో సందేహంలేదు. దళంలో తగిన సరుకు, చురుకు వుంటే జనాన్ని కట్టిపారే యొచ్చు!

బుఱ్ఱకథ - హంగులు

'ఏమిటోయి పెద్దహంగు చేస్తున్నావు? అంటారు. హంగు అంటే హడావిడి అన్నమాట. ఈ హడావిడి చేసేందుకు బుఱ్ఱకథకి కావాల్సిన 'హంగులు' ఏమిటీ అంటే తంబురా, జోడు గుమ్మెటలు, అందెలు, గజ్జెలు, ఉచితమగు వేషధారణ, కథారంభంలో కొట్టేం దుకో కొబ్బరికాయ, కథానంతరం మంగళం పాడేటప్పుడు వెలి గించేందు కింత కర్పూరమూను.

ఇవి ముఖ్యం. అన్నట్టు హంగుల విషయంలో రంగులు కూడా ముఖ్యమే! (కోటా). యింటికి అన్ని హంగులూవున్నాయి. చాలా బావుంది 'అంటాం, అలాగే ఈ హంగులన్నీ వుంటేనే బుఱ్ఱ కథ బాగా వుండడం సాధ్యం. 'హంగుదారులు' అంటే వంతపాటకు లని పాఠకులు గ్రహించాలి!

బుఱ్ఱకథా ప్రదర్శన

బుఱ్ఱకథ గురించి వ్రాసే టప్పుడు బుఱ్ఱకథ ఎలా చెప్పాలి అనేది ముందు చెప్పాలి.

బుఱ్ఱలు రాకుండాను, బుఱ్ఱలు లేకుండాను చెప్పేకథ బుఱ్ఱ కథ ఎంత మాత్రం కాదు. ఈ సత్యాన్ని వేయిమాట్లు ఇక్కడ తెగనొక్కి వ్రాసినట్లుగా పఠితలు భావించ ప్రార్థన.

బుఱ్ఱలు రాకుండా చెప్పేకథలు: అంటే, సెంటర్ కు తంబురా శృతి చేయడం, మీటడంరాదు. వంతలకు బుఱ్ఱలు (గుమ్మెటలు)

పట్టడం, కొట్టడం రాదు. తంబురాకు తీగెలుండవు. గుమ్మెటలకు మూతలుండవు. అసలా వాయిద్యాల మ్రోత లుండవు. అంటే అవి వట్టి మోతదండగన్న మాట. తబలా హార్మోనీ లేవో వెనకాల మ్రోగుతుంటాయి. దళంవారు బుర్రలను వాయిస్తున్నట్టు నటిస్తూ కథను చెబుతారు. ఇక—

బుర్రలు లేనివాళ్లు చెప్పేకథలు: అంటే, అసలు తంబురా ఢక్కీలు వుండవు. వంతలు ఒకాయన హార్మోనీ మెడలో, ఇంకో కాయన డోలక్ మెడలో వేసుకుని, సెంటరు ఏ లైటు ఫ్యాంటో వేసుకుని స్టేజి ఎక్కి బుఱ్ఱకథ బాణీలు పాడతారు.

ఇవన్నీ బుర్ర కథలంటేను, అనుకుంటేను, నమ్మితేను, నమ్మ మంటేను ఎలా సాధ్యం? ఎలా సమర్థనీయం? ఏం సమంజసం?

ఇవన్నీ-అప్ టు డేటు డెవలప్ మెంట్సంటే-చక్కని పౌరా ణిక నాటకాల్లో శ్రీరామునికి బెల్ బాటమ్ ఫ్యాంట్, సీతకు బాబ్డు హైర్ స్టయిల్సు వేసి, చేసి, చూపించడం వంటిదే!

కనుక, బుర్రకథలలో ఇట్లాటివి కుదరవు. బుర్రలు రాకుం డాను, బుర్రలు లేకుండాను చెప్పేకథలు బుర్రకథలుకావు. కాలేవు. కాబోవు.

ఈ విషయంలో నాజర్ అభిప్రాయాన్ని తెలుసుకుందాం.

"కథకుడికి తంబురా శృతిచేయడం గాని మ్రోగించడం గాని రాదు. వంతలకు బుర్రలు పట్టడడం గాని కొట్టడం గాని రాదు. అయినా బుర్రకథ చెప్పాలని వల్లమాలిన ఉత్సాహం!

శృతిలేని పాట మతిలేని మాట,

తాళంలేని గీతి శీలం లేని నాతి,

కనుక శ్రుతిలయలకోసం ప్రక్క వాయిద్యాలను పెట్టుకుని కథలు చెబుతున్నారు. బుర్రలను ఉపయోగించడం వచ్చిన రోజున మిగిలిన వాయిద్యాలు అనవసరమే మరి. బుర్రకథకి బుర్రలు ముఖ్యం!"

దీనిని కాదనగలవా రెవరు?

బుర్రలులేకుండా బుర్రకథ ఏమిటని ఇటీవల-జనం అడుగుతున్నారు కూడా!

కథ చెప్పాలి. అయితే ఎలా చెప్పాలి? ఈ విషయమై ధేనువకొండ వెంకయ్య విరచితమగు 'విరాటపర్వము' జంగం కథలో ఈ విధంగా పేర్కొనబడింది:

రగడ

"భారత మొక ... ...

...... ... ... ... ...

నీటుగ విభూది రేఖలు దాల్చియు
నిల్వుటంగీ ల్దొడిగీ

వేటు రుమాలల్ సేటు పాగా ల్వ
ల్లె వాటు లొనర దాల్చి

జోడు గుమ్మెటలు దట్టుచు వంతలు
జాడుచు మరియొకడు

పోడిమిగా చే బూని సితారా
భుజమున ధరియించి

గజ్జెలు మువ్వలు అందెలు పదముల
ఘల్లని మ్రోయగను

తరుఘణుత తక యని నాట్యము సల్పుచు
తంబుర మీటుచును
...........”

జంగం కథ బుఱ్ఱకథ కవలపిల్లలే గనుక ఇవే నియమాలు బుఱ్ఱ కథలకూ వర్తిస్తాయి. బుఱ్ఱకథనే నాజర్ 'తంబుర కథ అంటూ ఇలా వివరించడం జరిగింది.

“సోదర ఆంధ్ర వీరుల్లారా ॥తం॥
... ... ... ... ... ...
జోడుగుమ్మెటలు తాధిమి యనగ
తోడుగ వంతలు ఆడిపాడగా
రాగతాళగీతాది నృత్యముల తంబుర కథ వినుడీ.”

దీనినే నదీరా అనే మరో రచయిత ఈ క్రింది విధంగా పేర్కొన్నాడు—

“జై హిం దని జై కొట్టి తంబురా
శ్రావ్యంబుగ మీటి
జై భారత్ యిదియే మా శృతి యని
జగజగాల చాటి
రవ్వల వెల్గుల జీవకళల నవ
రసముల కురిపించి
రాగతాళ గీతాదుల నృత్యపు
రవళి రంగరించి
అందెలు గజ్జెలు జోడు గుమ్మెటలు
హంగులీను చుండ

ఆడిపాడెదము తంబురగాధను
అన్నలార నినుడు!"

బుఱ్ఱలకు ఇంత ప్రాముఖ్యతే లేకపోతే ఇది బుఱ్ఱకథ అని అన బడేదే కాదు.

**బుఱ్ఱకథలు: నాజర్ యుగం**

బుఱ్ఱ కథల్లో ఇది నిశ్చయంగా నాజర్ యుగం. ప్రాచీన యక్షగాన సంప్రదాయాలను ప్రాణప్రదంగా కాచుకుంటూ నిజమైన బుఱ్ఱ కథకు నిర్వచనంగాను, నిలువుటద్దంగాను, తన కథను నిల్పిన ఘనత ఈ సహృదయునికి దక్కుతుంది. అందుకే బుఱ్ఱ కథా ప్రపంచ మీయనకు మ్రొక్కుతుంది.

నాద పితామహ త్యాగరాజు
కవితా పితామహ అల్లసాని పెద్దన
హరి కథా పితామహ ఆదిభట్ల
బుఱ్ఱ కథా పితామహ నాజర్

ఆయా బిరుదులు ఆయా దిగ్గజాలను వలచి వరించి తరించాయి. తమ తమ రంగాలలో వారు అత్యున్నత ప్రమాణాలను సాధించారు. అందరి ప్రణామాలను అందుకున్నారు.

నాజర్ ఎక్కడ ఎప్పుడు కథ చెప్పినా, కథలో ఎక్కడో అక్కడ ఇది యక్షగానం! ఇదీ యక్షగానం! ఇదే యక్షగానం! అని అనిపిస్తాడు. అమృతాన్ని వర్షిస్తాడు.

ఇలా - ఒక్క జీవిత కాలపు కృషిని వెచ్చించి, పెక్కురి జీవిత కాలపు కృతులను (యక్షగాన కవుల, గాయకుల, ప్రదర్శకుల కృతులను) రక్షించిన కీర్తి ఈ కళా తపస్వికి మిగులుతుంది. ఈయన కథ మన బుఱ్ఱలలో మిగుల్తుంది.

భీమవరంలో 'శ్రీగన్నాబత్తుల' రసజ్ఞులగు ప్రజల అండదండలతో, నాజర్‌ను ఏనుగపై ఊరేగించి, ఘన సన్మానం జరిపి, "ఆర్థికంగా పెద్ద మొత్తం సమర్పించ లేకపోయినా హార్దికంగా చేసే ఈసన్మానం చంద్రునకో నూలుపోగు" అని పలికి – ఆంధ్రజాతి యొక్క కళా పోషణా రాహిత్యాన్ని నిరశించాడు. చేతైనంతలో ఉత్తమ కళాకారులకు చేయూత నిచ్చే రసజ్ఞులకు దేశంగొడ్డు పోలేదని నిరూపించాడు. ఇది బుఱ్ఱకథలకు, బుఱ్ఱకథ దళాలకు గర్వకారణం. అయినా – విత్తంతోచేసే సన్మానం కన్న చిత్తాన్ని సమర్పిస్తూ చేసిన ఈ సన్మానం ఉత్తమోత్తమమైన దని పలువురు శ్లాఘించారు.

జంగం కథలలో గల లోతుపాతులు – గుమ్మెటకు గల ప్రాముఖ్యం గుమ్మెట వాళ్ళకు గల ఛాన్సు – ఇత్యాదులుచూస్తే బుర్ర కథలు చాలా వెనుకబడి వున్నాయేమో ననిపిస్తుంది. కాని వెనుకబడిన బుర్ర కథలను వెలుగులోకి తెచ్చి విడిచాడు నాజర్. జంగం కథలోగల గుట్లు, మట్లు, పట్లు, ఈయనకు పూర్తిగా పట్టు బడ్డాయి. మరికొన్ని మెట్లు ఈయన పైకి ఎక్కడం కూడా జరిగింది. ఇది ముందు పుటలలో నిరూపిస్తాను. ఇప్పుడు 'వంతలు – వంత పాటలు' గురించి తెలుసుకుందాం.

**వంతలు – వంతపాటలు**

ఏ వ్యాపారం చేసుకోనీ! One Head and Two Hands దేవుడు ప్రతి మనిషికీ యిచ్చిన పెద్ద క్యాపిటల్! బుర్రకథ ఒక చక్కని పూలవనం అయితే–దానికి మూలధనం One Centre and Two Sides!

కథకునికి ఇరుప్రక్కలా వుండేవారిని వంతలనీ, వారు పాడే పాటల్ని వంత పాటలనీ అంటారు.

కొన్ని వంత పాటల్ని తెలుసుకుందాం.

1. తందాన తందాని తందనా
2. భళా నంటి భాయి తమ్ముడా— సై
   భాయి భళానోయి దాదానా
3. వినరా ఆంధ్ర కుమారా ధీరా
   విజయము మనదేరా
4. తందన భాయీ దేవనందనానా — తందానితాన
5. ఓ భారతీయుడా, ఓ వీరయోధుడా
   లేవయ్యా - లేచి రావయ్యా
6. తందానా, తుమ్మెదా

ఇత్యాదులు గాక సర్వాయి పాపడు వంటి బాణీలలో కథకుని పాటనే వంతలు రిపీట్ చేస్తుంటారు.

విషాద ఘట్టాలలో కథ వుండగా 'హరిహరీ' అనీ, 'అయ్యో' అనీ వంతలు అనాలి గాని - భేష్, శహభాష్, భళిభళా వహ్వా, ఉషార్ - ఇత్యాది ఊత పదాలని అనకూడదు. పేరెల్లిన పెద్ద దళాలు సైతం ఈ తప్పులను చేస్తుండడంవల్ల ఇక్కడ ఇది వ్రాయవలసి వచ్చింది.

**గుమ్మెట వాయిద్యం**

ఈ విషయంలో అగ్రతాంబూలం జంగాలదే. వారికి యిదే వృత్తి గనుక - ఇదే భుక్తి నిచ్చేది గనుక బుర్ర అంటే ఎనలేని భక్తి విశ్వాసాలు వారిలో కానవస్తాయి. వాటిని దేవతా విగ్రహాలని చూచి నంత భక్తితో చూస్తారు. తదేక దీక్షతో సాధిక చేస్తారు. నిత్యం వేదిక నెక్కాలి గనుక అనునిత్యం సాధిక సాగుతూనే వుంటుంది. కథలో బరువులను బట్టి గుమ్మెటపై దరువులను వేసుకుంటూపోతారు.

అసలు - గుమ్మెటకు దణ్ణం పెట్టేప్పుడు మామూలుగా వున్న వ్యక్తి రూపం, గుమ్మెటపై చేయి వేయగానే శక్తి స్వరూపంగా మారిపో తుంది. మధురంగా మధురాతిమధురంగా, మహోద్ధృతంగా గుమ్మెట లను వాయిస్తారు. కొన్ని కొన్ని ఘట్టాలలో - నాట్య మాడే వ్రేళ్ళకు గుమ్మెటలకు మధ్య నల్లబండలు నలిగిపోతాయా అనిపి స్తుంది. యుద్ధ ఘట్టాలలో గుమ్మెటలు సమ్మెటలై పోతాయి. ఈ నాదం తీసేందుకు గుమ్మెటను సరకాలి. అంటే చేయి బాగా త్రిప్పి విసరాలి. ఏటవాలుగా గుమ్మెటపై దెబ్బ తగలాలి. ఈ విధమగు వాయిద్యంలో అనితర సాధ్యమగు ప్రజ్ఞను చూపగల వ్యక్తి గుంటూరు జిల్లాకు చెందిన తాడికొండ సుబ్బయ్యగారు. (దొడ్డారపు వెంకట స్వామిగారి వంత) ఈవాయిద్యాన్ని, ఈయనవద్ద, ఈ గ్రంథ కర్తనగు నేను, నావంతలు బాల, భాస్కరం అభ్యసించాం. చేతివ్రేళ్ళ చర్మం పది పన్నెండు మాట్లు చిట్లింది. గుమ్మెట చర్మం పాతిక ముప్ఫయి మాట్లు చిట్లింది. 'గుత్తి బెణక్కపోతే గుమ్మెట వాయిం చినట్టే కాద'ని ఆయన అంటూండేవారు! గుమ్మెట వాయిద్యం విష యంలో విరామ మెరుగని సాధికే వియజ వేదిక. ఇప్పుడు ఈ వాయి ద్యంలోని 'ఓనమాల'ను తెలుసు కుందాం—

క్రమం : జుం జుం త (మూడు దెబ్బలు)

1. జుం జుం త ధింత । జుం జుం తధింత ।

2. జుం జుంత । ధింత జుం జుంత । ధింత జుం జుంత ।

   (ఇదే మూతవల్ల 'తక తక్కిట్ట' అనీ, 'తకధిం తక' అనీ పలుకు తుంది).

3. తక తక్కిట్ట । తక్కిట తక్కిట్ట ।

4. తక తక్కిట్ట । దరికిట తక్కిట్ట ।

5. త । ఝుణం తకత । ఝుణం తకత ।

6. త । ఝుణం తక తకత ఝుణం తక్కిట త ।

7. దరికిట తక్కిట్ట । ధి త్తరికిట తక్కిట్ట । తక దరికిట తక్కిట్ట ।

8. ధి త్తరికిట తక దరికిట । ధి త్తరికిట తక దరికిట ।

9. తకిట తకిట తక - ఇదే - ధింత తదిమి తక ।

10. దరికిట దరికిట - ధోంకి తధోంకి

11. తకధిం తక । దరికిట ధింతక ।

12. తతా త్త ధింతక । త త్త త్త త్త ధింతక ।

13. తతా త్త తక్కిట దరికిట త త్త త్త త్త తక్కిట దరికిట

14. ధిం తరికిట తక తక్కిట దరికిట ।

15. ధిం తరికిట ధిం ధి త్తరికిట ధిం

సాధికతో ఇంతవరకు ఎవరైనా సాధించవచ్చు. గ్రుడ్లప్పగించి చూస్తుంటే కష్టంగాని గుమ్మెట తీసుకుని సాధికలో పడితే సులువే. ఇంకా మెలకువలకు గురువుసాయం అవసరం. యింతసాధిక చేసినా అదృష్టముంటే దొరుకుతాయి. లేకపోతే పట్టుపడవు. ఈ విషయంలో అవిరళ సాధికే అఖండ విజయవేదిక. 'రాకపోవడ'మనే రోగానికి 'సాధికే'మందు!

**ముక్తాయింపులు**

ముగింపు, ముక్తాయింపు వల్ల ఇంపుగాను, సొంపుగాను వుంటుంది.

ముక్తాయింపులు అంటే గానం ఆపేటప్పుడు ప్రయోగించవలసిన కొన్ని పడికట్టు వాయిద్యవిశేషాలు. ఇవి నోటితో అనడంలో

విశేషమేమీలేదు గుమ్మెటమీద పలికించడంలోనే వుంది పనివాడి తనం. వీటిని నాజర్ దళంలోని 'రామకోటి- లక్ష్మీనరసయ్యలు' లక్ష్మీనరస్సయ్య, వెంకటేశ్వరరావు, చిన్నాబ్బాయి, సలాది, పండు, మున్నగువారు చక్కగా పలికించారు. నేడు చాలా దళాలు వీటిని చక్కగా అభ్యసించాయి. కాని ఎన్నో దళాలు వీటిని నోటితో అనడంతోనే సరిపెడతాయి. గుమ్మెటపై అంటేనే అందం. అట్టి ముక్తాయింపులలో కొన్ని యివి-

1. తక ఝ్ఝంత ధింత
2. తక తకఝ్ఝంత తక తకఝ్ఝంత ధింత
3. ధింత తదిమితక ధోంతక్కతక తక తకఝ్ఝంత ధింత
4. తకిట తకిటతక దరికిట దరికిటత
5. తదిమి తకిటతక ఝుంతరి కిటతక త
6. తరికిట ఝుంతరిత
7. తఝుణం తకత
8. తఝుణంతక తక తఝుణంతక తక్కిటత | తక్కిట దరికిట ఝుంతరిత

ముగింపు బిగింపు ముక్తాయింపువల్ల ఇంపుగాను సొంపుగాను వుంటుదని మరోసారి మనవి చేస్తున్నాను.

**రాగతాళాలు**

కథా ఘట్టాల కనుకూలంగా కథకుడు రాగతాళాలను ఎన్నుకోవలసివుంది. యుద్ధ ఘట్టాలలో శివరంజనిరాగం విచారఘట్టాలలో శ్రీరాగం ఇత్యాదులు వర్జనీయాలు. సినిమా పాటల బాణీలు మరి తేలిపోతాయి. ఎత్తుబడిలో దేవగాంధారి రాగం ఎంతో రక్తికడు

తుంది. ఏమైనా రాగతాళాల విషయం నిర్ణయం తీసుకోవడంలో దళం చాలా శ్రద్ధ బూనాలి. మధ్య మధ్య పద్యాలు, జాతీయ గీతాలు, ప్రబోధ గీతాలు కథను మరింత రక్తి కట్టిస్తాయి.

కథ-హాస్యం-రాజకీయం

ఇది ఒక త్రివేణీ సంగమం. దైవసేవకు తులసీదళం ఎటువంటిదో, దేశ సేవకు బుఱ్ఱకథ దళం అటువంటిదే!

బుఱ్ఱకథ దళాలే గనుక (అన్నీ) నీతీ నిజాయితీ కలిగివుంటే-ఏ ఒక్కదళం 'కళాకుల్కా'నికి అమ్ముడు పోకుండా వుంటే దేశాన్ని ఎలా తీర్చి దిద్దాలంటే అలా తీర్చి దిద్దగలగడం అసంభవమేమీ కాదు. ఇది పరమసత్యం.

ఆర్థిక సమస్యల దృష్ట్యా ఒక దళం మూడు దళాలు కావడం అదే కారణంతో అవి మరల తొమ్మిది దళాలు కావడం-ఇత్యాదులు బుఱ్ఱకథల అభివృద్ధికి దోహదం చేయవు.

చీటికి మాటికి దళాలు విడిపోయి, అనుభవంలేని క్రొత్త దళాలను లేపుతుండడంవల్ల టీమ్సు ఎక్కువవుతాయిగాని టీమ్ వర్క్సు తక్కువై పోతాయి.

ఈ విషయం తెలిసీ, అర్థస్వార్థాలకి లొంగిపోయి పొరపాట్లను చేసినవారు ఇప్పటికైనా గుండె కుదపాలి, కుళ్ళు దులపాలి గ్రుడ్లు విదపాలి, గుర్రుమానాలి.

బుఱ్ఱకథ దళాలు కలకాలం కలిసి వుండాలి. ఇది బుఱ్ఱకథల అభివృద్ధికి తొలిమెట్టు

బుఱ్ఱకథ దళం స్టేజి ఎక్కాక ప్రదర్శనకాని అదరుసకారు. స్టేజి మీదేకాదు బైటకూడా. ఈ విషయం ముగ్గురిలో ఏ ఒకరు

విస్మరించినా-ఏ ఒకరి బుర్రలో స్వార్థం అనే పురుగు పుట్టినా-ఆదళం అభివృద్ధికి పురిట్లోనే సంధి కొట్టినట్లు.

ఎవరైనా సరే కళాకులాన్నికి అమ్ముడుపోయి కళాద్రోహా నికి దిగడం నేరాలలో నేరం, ఘోరాలలో ఘోరం, పాపాలలో పాపం, శాపాలలో శాపం.

కళ మనని పోషించే స్థితిలో గాక కళని పోషించే స్థితిలో మనని మనం వుంచుకోవడం గొప్ప విషయం.

"ఉన్నతంగా జీవించడమే ఉత్తమోత్తమ మైన కళ"

—గాంధిజీ.

"ఎవరికీ ఏ విధమగు అన్యాయం జరక్కపోయిన రోజున మాత్రమే కళకు సరైన అర్థం గుర్తించబడినట్లు!"

డా॥ సర్వేపల్లి రాధాకృష్ణన్

ఎంత చక్కని నిర్వచనాలు!

బుర్రకథ దళం విషయంలో కథ, హాస్యం, రాజకీయం ఈ మూడిటిని నిర్వహించేవారు 'స్వంత లాభం కొంత మానుకు పొరుగు వారికి తోడుపడవోయి' అన్న నీతిని ఒకరి యెడల ఒకరు నెర వేరుస్తూ ప్రజల నుండి తలకుమించిన డబ్బు డిమాండ్ చేయకుండా, అందరికీ అందుబాటులో కథలు చెప్పినట్లయితే ఆ దళానికి పోటీలేదు, సాటీలేదు.

జీవితంలోనే కాదు. కథలోనూ అంతే. కథకుడు హాస్య రాజ కీయాలకు తగినంత అవకాశం యివ్వాలి. అలాగే సమయోచితమగు హాస్యం, చక్కని రాజకీయం, కథకి పుష్టిని కలిగించి, అపూర్వ కళా సృష్టికి దోహదం చేయాలి. బుర్రకథ దళాలు ఈ విషయానికి ప్రాణా ధిక ప్రాముఖ్య మివ్వాలి.

**కలాలు, గళాలు, దళాలు**

కవుల కలాలు, గాయకుల గళాలు, కర్షకుల హలాలు, కావలసిన జలాలు బాగా వున్న రోజున మాత్రమే దేశం సర్వతో ముఖాభివృద్ధిని సాధించగలుగుతుంది.

కలాలకు, గళాలకు, కళలకు, ప్రజల కలలకు అవినాభావ సంబంధం వుంది. కలం, గళం తీసుకుందాం. కలంవేరు గళంవేరు కాదు.

వాల్మీకి ఘంటానికి కుశలవుల కంఠాలు వన్నెదెచ్చాయి. కాళీమాత కంఠాన్ని కాళిదాసు ఘంటం ద్వారా నేటికీ మనం వింటున్నాం.

కవుల కలాలకు గాయకుల గళాలు తోడైతే జోడైతే కలానికి గళానికి పటిష్టత విశిష్టత సమకూరతాయి.

'చక్కని కలం, ఎంచక్కని గళం' ఈ రెండిటిపైనే ఎంతో చక్కని బుర్రకథ దళం ఏర్పడడం అనేది ఆధారపడివుంది. ఈ విష యాన్ని దృష్టిలో పెట్టుకుని ముందు కొందరు బుర్రకథ కవులను పేర్కొంటున్నాను. పిదప కొందరు కథకులను, వంతలను పరిచయం చేసి, అనంతరం బుర్రకథ రచనల పరిశీలనకు దిగుదాం,

**కొందరు బుర్రకథ కవులు**

ప్రజాకవి సుంకర సత్యనారాయణ, ప్రజాకవి నాజర్, అభి నవపోతన వానమామలై వరదాచార్యులు, కవికుమార్ మాచి రాజు లక్ష్మీపతి, జంపన, కొసరాజు రాఘవయ్యా చౌదరి, లక్ష్మీకాంత మోహన్, తెల్లాకుల వెంకటేశ్వరగుప్త, రుక్కాభట్ల విధుమౌళిశర్మ, పేరి సుబ్బారావు నీలాజంగయ్య, శ్రీపాద శ్రీరామమూర్తి,

వారణాశి వేంకట నారాయణశాస్త్రి, రామకవచం సత్యనారాయణ పి. బాలకృష్ణ, ప్రయాగ, రెడ్డి చినవెంకటరెడ్డి, ఎనమంద్రసుబ్బారావు దంటు కృష్ణమూర్తి, నదీరా మున్నగు కవులు ఎన్నో బుర్ర కథలను రచించారు.

ఇక్కడ ఓవిషయాన్ని గమనించాలి. ఎన్నోకథలు గ్రంధస్తమైనా ఎవరిచేతా కంఠస్తం కాని కథలూ వున్నాయి. గ్రంధస్తం కాక పోయినా ఎందరిచేతనో కంఠస్తమైన కథలూ వున్నాయి. చక్కని కధలకు నోళ్ళు ఊళ్ళే గ్రంధాలు, గ్రంధాలయాలు!

**కొందరు కధకులు**

ఆంధ్రబుర్రకధా పితామహ నాజర్

జూనియర్ నాజర్, నిట్టలా బ్రదర్స్, బెనర్జీ, లక్ష్మీకాంత్ మోహన్, హనుమంతరాజు, పున్నంరాజు భానుమూర్తి, చందన కోటేశ్వరరావు, శిష్టా సాంబశివరావు, పలాది, పండు, వింజమూరి రామారావు, గొట్టెల రామం, సైదుల్, షేరి సుబ్బారావు, రెడ్డి చినవెంకటరెడ్డి, ప్రయాగ, కృష్ణమోహన్ (ఇందుపల్లి), కృష్ణ మోహన్ (మంటూరు), తాత నాగేశ్వరరావు, అల్లాడ బాలశంకర రావు, ప్రసాద్‌దళం (గుంటూరు), ప్రసాద్ దళం (జిల్లేళ్ళమూడి). కొమర శ్రీదళం, కోటంరాజు, చిట్టాల నారాయణరావు, దొంగ సత్యనారాయణ, నీలాజంగయ్య, బళ్ళగంగరాజు, డి. కనకయ్య, పురుషోత్తమ్, వి. నరసింహారావు, భువనగిరి నారాయణ, లక్ష్మణ రావు (రాజోలు), కీ. శే. బూర్గుల రామమూర్తి, కీ. శే. కొంతం త్యాగరాజు, జయంతి, నదీరా మున్నగువారు కొందరు కధకులు.

శ్రీమతిభద్రకాళి, శ్రీమతి శారద, కుమారి వాణి మున్నగు వారు కధకురాండ్రు.

ప్రజానాట్యమండలి ఇటీవల నిర్వహించిన బుర్రకథల పోటీలో "సజ్జకనకారావు దళం"—వచ్చి పాల్గొన్నదళాలలో ఉత్తమ దళంగా ఎన్నికైంది.

**కొందరు వంతలు**

రామకోటి, కర్నాట లక్ష్మీనరసయ్యా, వెంకటేశ్వరరావు, పురుషోత్తమ్, మిక్కిలినేని, రాజబాబు, పండు, చక్కా సూర్యనారాయణ, నిట్టల శత్రుఘ్నరావు, నిట్టల హనుమంతరావు, మండ లీక కృష్ణభాస్కర్, అల్లాడ బాలశంకరరావు, డొక్కా అనంతరామమూర్తి, చిన్నబ్బాయి, కట్టావీరయ్యా, సుబ్బారెడ్డి, సలాది భాస్కరరావు, నూకల అప్పన్నశాస్త్రి, నాగరాజు, పిల్లాఅప్పారావు, దొంగ కృష్ణమూర్తి, అడబాల కృష్ణమూర్తి, గంగాద్రి, వింజమూరిలక్ష్మణరావు, వడ్లరాజయ్యా, లక్ష్మణ్, యాదగిరి, కోసూరి పున్నయ్యా. పి. ప్రభాకరరావు, వి. వి. శర్మ, జన్నాభట్లరామం, కుసుమ, ఝూన్సీ. దొంగ కేదారేశ్వరరావు, శ్రీమతి తులసి, కీ. శే. మండలీకరామం బళ్ళ అచ్చిరాజు మున్నగువారు కొందరు వంతలు.

హార్మోనీ తబలా ఎక్స్ట్రా ఎక్స్ట్రా వాయిద్యాలు పెట్టి కథలు చెప్పేవారిలో కీ. శే. నిడదవోలు అచ్యుతరామయ్యా-సుంకర కృష్ణమాధవరావు, కుమ్మరిమాస్టారు, కప్పగంతులరామం మున్నగువారు కథకులు; మల్లిక్, కూచిపీరభద్రశర్మ, సలాది వెంకన్న, మండలీక కృష్ణభాస్కరము మున్నగువారు వంతలు.

**బుర్రకథ రచనలు - పరిశీలన**

ఇంతవరకు చదివినది ఒక ఎత్తు. ఇక చదువబోయేది మరొక ఎత్తు. అతి ముఖ్యమగు ఘట్టంలో మనమిప్పుడు ప్రవేశిస్తున్నాము. బుర్రకథలు వ్రాయడంగాని బుర్రకథల గురించి వ్రాయడముగాని మాటలుకాదు. ఇందుకు కావలసినది థియరీ నాలెడ్జికాదు. ప్రాక్టి

కల్ నాలెడ్జి. ఊహాగానం వేరు. అనుభవజ్ఞానం వేరు. ఊహాగానం అనుభవజ్ఞానం ఎన్నటికీ కాదు.

కవి వ్రాసిన కథలు వేరు. కథకుడైన కవి వ్రాసిన కథలు వేరు. కథకుడు వ్రాసినకథలకి ప్రదర్శనదృష్ట్యా ప్రత్యేకత ఎప్పుడూ వుంటుంది. నటుడు వ్రాసిన నాటకాలకీ ఈ ప్రత్యేకత వుంటుంది.

ప్రజా కవి సుంకర సత్యనారాయణ కథకుడైనదీ కానిదీ తెలియదు. కాని ఈయన వ్రాసిన కథలు కథకుడైన కవి వ్రాసిన కథలను మించిపోతాయి. అందుకే ఈయన వ్రాసిన కథలు వందలాది దళాలచే ప్రదర్శింపబడి లక్షలాది ప్రజానీకాన్ని ఉర్రూతలూగించాయి. ఈయన కథలను పరిశీలిద్దాం.

**సుంకర కథలు**

కష్టజీవి, అమరజీవి, రుద్రమదేవి, అల్లూరి సీతారామరాజు, కందుకూరి వీరేశలింగం, మహారథికర్ణ మున్నగు కథల నీయ రచించారు. సుంకర కలంవల్ల ఈ కథానిధులు సుధానదులై బుర్ర కథలకెంతో వన్నెదెచ్చాయి.

A. రామరాజును, B. రామరాజు సమీక్షిస్తు (A=అల్లూరి B= బిరుదురాజు) తమ తెలుగు జానపద వాఙ్మయ చరిత్ర (History of Telugu folk songs) లో సుంకర కలంలోని సుధామాధురులను చాలా వరకు ఎత్తిచూపారు.

మరికొన్ని సురభిళాలను ఇచ్చట అందజేయడం పఠితులకు విందు చేయడం అప్రమత్తంకాదు.

సీతకై ఆ రాముడు, జాతికై ఈ రాముడుఅడవులలో సంచరించారు. మన్యంలోని ఆ మహారణ్యం యింత భయంకరంగావుంటే

మాత్రం త్యాగాలకు వెనుకాడని తెలుగుజాతి మొనగాడైన రామ రాజును భయపెట్టగలదా ?

"సూర్యుడు గ్రుంకని సామ్రాజ్యంబున
చుక్కల మొలిపింప
కార్యదక్షు బెదరించగలదె ఈ
కారడవుల భయము !"

పోరాటంలో అల్లూరి మూర్తి అస్తమించింది, ఆయన కీర్తి విస్తరించింది. ఇది కథలోకాని చరిత్రలో దీనికి తగిన సాక్ష్యాధారాలు లేవు. ఇచ్చట—

"అన్నా నిను మరువరు మరువరు నీ
ఆంధ్ర సహోదరులు
ఉన్నావో లేదో కొందరు నీ
వున్నావంటారు"

—ఆ కొందరితో ఏకీభవించడు సుంకర

"లేడనువాడెవ్వడు మా హృదిలో
నీ ప్రతిబింబంబే
నేడు జ్యోతివలె ధగధగ మండుచు
నిలచియుండగానే"

కందుకూరి వీరేశలింగం కథలో వంతపాటలు చాలు కందు కూరిని ఫొటోతీసి మనకళ్ళముందు పెట్టేందుకు—

సంఘోద్ధరణ విచారాధీరా
సాహసగుణధామ
పండిత వితండవాద ఖండనా

ప్రజాభాష పోష
మహిళా ఉద్యమ నిర్మాత ఓ
మహితగుణ విశాల

విద్యార్థుల నిజమార్గ ప్రదర్శి
వినుత సుగుణశీల"

'రుద్రమదేవి' కథలో 'గన్నారెడ్డి—గురప్రుస్వారీ' ఘట్టం—అశ్వాన్నీ, ఆ దృశ్యాన్నీ కళ్ళకు కట్టించడం—

"అప్పుడు గన్నారెడ్డి సాహిణి
ఆజ్ఞలందుకుని అంబకు మ్రొక్కి—
బిరానదట్టీ బిగించిగట్టీ
జరీ అంచు తలపాగా జుట్టీ
కుప్పించి పైకే లేచాడా
గుర్రంమీదే వాలాడా

కాళ్ళంకెమున పెట్టనేలేదు
కళ్ళెమైన చేపట్టనేలేదు
అరరే చూడుము దాని తామసం
అదురుపాటుగా లేచిన గుర్రం
మూడే చక్రాల్ గొట్టిందా
ముందుకు చెంగున దూకిందా

దూకిన గుర్రం మింటలేచెరా
ధూళి ఆకసం కాపులేచెరా
కన్నుమూసి కన్దెరువలేదురా
కంటికి గుర్రం కానరాదురా

గుట్టలు మిట్టలు దాటిందా
పిట్టవోలే అది పోతుందా!"

కథకుడిలో చెప్పే దమ్ముండాలేగాని ఎంత చక్కని రచన! దీనిని బెనర్జీ దళం (హైదరాబాద్) ఎంతో చక్కగా గానం చేస్తుంది. గతానికి ప్రాణంపోస్తుంది.

**నాజర్ కథలు**

ఇతర కథలకు నాజర్ కథలకుగల భేదమేమిటంటే ఇతర కథలను కథకులు పోషించాలి. నాజర్ కథలు కథకుల్ని పోషిస్తాయి. స్టేజిమీద నిలబడి అలా అనేస్తేచాలు రక్తికడతాయి. జంగం కథలలోని గుట్లు మట్లు పట్లు నాజర్‌కు పట్టుపడడమేగాక మరికొన్ని మెట్లు ఆయన ఎలాపైకి వెళ్ళిందీ ఈ క్రింది ఉదాహరణలు తెలుపుతాయి. పల్నాడులో-

"లెండిక జాగేల-పోదము
రండి వీరులారా

దండిగ గ్రామస్తులంత-లెండోయి కూడి వేవేగమే
దుండగులగు వైరుల దుండగమ్ముల చెండిక బిరబిర
అండగ వైరులపైకి"

ఇచ్చట గుమ్మెటలపై అక్షరాలను వినిపించవచ్చు. గుమ్మెట దరువులు కథకు అక్షయవరాలు అనిపించవచ్చు. ఇలాటిదే—

"జననాథంల-జయభేరి మ్రోగెను" గుమ్మెట వాళ్ళకి కావలసినంత ఛాన్సు. కథకుడికి అంతకంటేను కళ్ళు ఉరమడం, పళ్లు కొరకడం, వొళ్ళు విరవడం ఇత్యాదులు చేయకుండా ఈ రణగీతాన్ని అన

డం కష్టం. అభినయం దాన్ని అదే పోషించుకుంటూ పోతుంది. ఇదీ నాజర్ కథలలోని విశేషం.

కథలో ఆ కళాజీవి వున్నా ఎదలో కష్టజీవి ఎప్పుడూ వుంటాడనేందుకు నిదర్శనలు 'ఎట్టా ఈ కాపురము', 'పరన్న రాకముందే'; బొబ్బిలిలోని తిరిపెమెత్తనేల పికిదీనతనేడేల'; 'సాగవయ్యా పర్వాక' మున్నగు గీతాలు.

'ధననష్టం, జననష్టం, రణమంటే ముదనష్టం' అని చాటుతూ పల్నాడులోని అలరాజు రాయబారం, బొబ్బిలిలోని దామెర ధర్మరాజు రాయబారం మానవతలోని ఉత్తమ విలువలను ప్రతిబింబిస్తాయి.

యుద్ధానంతరం పల్నాటి వర్ణన 'పాడు యుద్ధాలు పగవారికైనావద్దు మహాప్రభో' అనిపించేస్తుంది.

సాధారణంగా అన్ని కథలలోను నాజర్ పాడే 'మానవ జన్మము మంచిదిరా' అనే గీతం ఎగసిదూకే జలపాతంలా, శ్రోతల గుండెలలోకి దూసుకుపోతుంది. చరిత్రలో ధరిత్రిపై మానవుని పరిణామక్రమం ఈ గీతంలో మనకు వినపడుతుంది.

పల్నాటి యుద్ధం, బొబ్బిలి యుద్ధం, అల్లూరి సీతారామ' రాజు, శ్రీ జానకీవనవాసం, బెంగాల్ కరువు మున్నగు కథలను నాజర్ రచించి వేలాది ప్రదర్శనలీయడం జగమెరిగిన విషయం.

**కవి కుమార్ మాచి రాజు లక్ష్మీపతి కథలు**

"తెలుగు వెలుగు పలనాడు పౌరుషం
చెలగు సీమనాడు
పలికైన ఆ అనుగురాజు పెం
పలరుచు నున్నాడా

పలుబడికి గురజాల పట్టణం
మూల రాజధాని"

ఇది బుర్రకథలకు వన్నెదెచ్చే చక్కని కవిత్వ ధోరణి. కథ పాడుతుంటే ఆటోమాటిక్‌గా బుర్రకథ అట్మాస్ఫియర్ క్రియేట్ అయిపోతుంది. ఇలా తేలిగ్గా అందరికీ అర్థమయ్యేటట్టుండాలి బుర్ర కథ రచనలు.

కఠిన పదభూయిష్టమగు కవిత్వాన్ని బుర్రకథల్లో చొప్పిస్తే ఎదర కూర్చునేవాళ్ళంతా ఘనాపాటీలు మహాపండితులూనా? అర్థం చేసుకోవద్దూ? కవిత్వం అరటిపండు వొలిచి అందరికీ పెట్టినట్టుండాలి గాని, వొల్చుకుని కవి ఒక్కడే గుటుక్కున మింగేసినట్టుగాని, వొలవబడని కర్రఅరటిపండులాగాని వుండరాదు. అట్టి కవిత్వం బుర్ర కథలకి ఎంతమాత్రం పనికిరాదు.

**రెడ్డి చినవెంకటరెడ్డి కథలు**

ఈయన రచించిన ఆంధ్రకేసరి బుర్రకథను 'అవతారిక'ను వ్రాస్తూ డా॥ సి. నారాయణరెడ్డి కథ ఎత్తుబడిని ఉదహరిస్తూ—

"ఆదినుండి మన భారతదేశం అన్నపూర్ణయండీ
పూర్వము నుండీ భారతదేశము పుణ్యభూమియండీ"

...ఇదీ శైలీ అంటే ఇందులో కవిత్వ భారం లేదు. ఉండ కూడదు కూడా. అలవోకగా మాటలు దొర్లినై. ధార అంటే ఇదే అని వివరించారు. పంతులుగారు గుండుకు గుండెదురిచ్చే ఘట్టంలో "కథ వినేవాళ్ళ కండలు తాండవించేటంత బలంగా ఉజ్వలంగా కవి కథను నడిపాడు" అంటూ వెంకటరెడ్డి రచనను నారాయణరెడ్డి పఠితలకు పరిచయం చేశారు.

"నిజమేమరి! అదుగో ఆంధ్రకేసరి! ఆ బిరుదాతడి కేసరి!" అనిపిస్తుంది కథ! అనేక కథలను ఈయన వ్రాశారు.

**పేరి సుబ్బారావు కథలు**

ఖడ్గతిక్కన, ఝాన్సీ మున్నగు 5, 6 కథలనీయన వ్రాశారు. ఖడ్గతిక్కనలో-

"కాలచక్ర మహిమ
కాదన మన తరమా

కాటకమంతట కనులు దెరచెనా కాటమరాజ్యమున
బీటలువారెను బీడులన్నియు భీకరమ్ముగాను"
ఇలా సాగిపోతుంది కలం.

**వారణాశి కథలు**

ఈయన చేయితిరిగిన రచయిత. ఈయన భగవద్గీత బుర్రకథల విషయంలో ఒక గొప్ప Attempt—

"భగవద్గీతా గానము
పావనగంగా స్నానము
..............."

పావనగంగా స్రవంతిలా ప్రవహిస్తుంది కవనం.

**పి. బాలకృష్ణ కథలు**

తక్కువ ప్రజాధనంతో ఎక్కువ ప్రయోజనాన్ని ఎలా సాధించాలో వివరిస్తుంది-ప్రణాళికా ప్రచార నిమిత్తం ఈయనచే వ్రాయబడిన గిలకమ్మ కథ-

"గ్రామక్షేమం కొరకు మీరలు
త్యాగమించుక చేయకుంటే
వృద్ధియన్నది మిమ్ము అంటదురా

పసిపిల్ల బాలాదికీ అర్థమయ్యే శైలిలో పంచవర్ష ప్రణాళిక లను గురించి 'A to Z' ఇందులో చక్కగా వివరించబడింది.

**నదీరా కథలు**

రామయణ, భారత, భాగవతాలు, జిల్లేళ్ళమూడి అమ్మ, సత్యసాయి, పార్వతీ కల్యాణం, లడక్‌వీరులు మొదలయినవి ఇతడి కథలు.

అమ్మకథలో—

"దణ్ణాలు పెట్టుకొను ధ్యాస ఒకటే మనకు
అన్నాలు పెట్టుకొను ఆశ ఒకటే తనకు
కాశీ విశాలాక్షి కదరా—అమ్మ
కళ్ళార చూదాము పదరా"

"పార్వతీ కళ్యాణం" కథలో పార్వతిని శివుడు పరీక్షిస్తున్నాడు, పరమ శివుని వలచి వరించి తలచి తపించి పోతోందిపార్వతి. మారువేషంలో (ఫ్యాన్సీ డ్రెస్‌లో) శివుడు వచ్చి ఆమెతో అంటున్నాడు గమ్మత్తుగా!

'వరునిగ నే తగనా—ఆ
హరుని కోర తగునా

స్థిరుడుగ్గాని శివుడు సదా తిరిపె మెత్తుకొనును కదా ॥వ॥
ఇల్లు వల్ల కాడుకదా పెళ్ళితడికి వృథా వృథా! ॥వ॥

జడలు పరమరోతకదా వొడలు బూదిపూత కదా
జటధారిని జత కోరెడి జడురాలోక అడుదా? ॥వ॥
తాళిగట్టి వెంట పెట్టి జోలెను నీకంట కట్టి
ఇంటింటా నిన్ను ద్రిప్పుటెంత తప్పు నీవెచెప్పు! ॥వ॥
అతడి మెడను కనుగొన్న అగపడును నాగన్న
ఆ వెర్రి నాగన్న అధికుడౌనె నాకన్న! ॥వ,
ఇలా సాగిపోతుంది కవిత్వధోరణి

జంపన, కొసరాజు, వానమామలై, నీలా జంగయ్య, నిట్టల శతృఘ్నరావు మున్నగు ఎందరో కవులు ఎన్నో చక్కని కథలను వ్రాశారు.

అన్నిటినీ ఇచ్చట వివరించాలంటే ఈపుస్తక మాంజనేయునితో కలా పెరిగిపోతుంది. ఆ రచనలు అముద్రితాలు. కొన్ని అలభ్యాలు కొన్ని. కనుక ఇక 'బుర్ర కథలు-ప్రభుత్వకర్తవ్యం' అనే విష యంలోకి దిగుదాం.

**బుఱ్ఱకథలు - ప్రభుత్వ కర్తవ్యం**

ఇది చాలా ముఖ్యమైన విషయం.

పి. హెచ్. డీన్‌ని ఆఫర్ చేయడంవల్ల వెలలేని పరిశోధన గ్రంథాలెన్నో వెలుగులోకి వచ్చాయి. ఎవరు ఏమి వ్రాశారో పరి శోధించి వ్రాసిన వారికి పి. హెచ్. డీన్‌ని ఇస్తూఆ అసలు వ్రాసిన వారికి ఏ హెచ్. డీన్ నిఇవ్వ గలుగుతున్నాం. అలాగే గనుక ఇస్తే - అమూల్యమైన అమూల గ్రంథాలు అమూలఈమూలలందు పడివుంటాయి? ఇదీ ప్రశ్న.

ఇది యాచనకాదు. చక్కని యోచన. ఎంచక్కని సూచన. గుర్తిస్తే ప్రభుత్వానికి ఓ దండం. గుర్తించకపోతే రెండుదండాలు!

బుర్రకథలు లేకుండా ఆంధ్రప్రదేశ్‌లో ఏ నియోజకవర్గం లోను ఎన్నికలు జరుగలేదంటే అతిశయోక్తి కాదు. ప్రభుత్వం ఏర్పడ్డం విషయంలో బుర్రకథ దళాల పాత్ర విస్మరించ వీలులేనిది.

బుర్రజథల సహకారంతో ఎన్నికైన పెద్దలు బుర్రకథ దళాల వారికి ఏంచేస్తున్నారూ అంటే మళ్ళా ఎన్నికలొచ్చేవరకు మరచి పోతున్నారు. ఇది చాలా అన్యాయం.

బుర్రకథ దళాలవారు చాలా అల్పసంతోషులు. ఏ చిన్న సాయం చేసినా ఎంతో సంతోషిస్తారు. ఏ కొందరిని ప్రభుత్వం సన్మానించినా ఎల్లరూ సంతోషిస్తారు. నిజానికి ఏ బిరుదులతోను, ఎన్ని సన్మానాలతోను విలువకట్టలేని కళా తపస్వులు బుర్రకథ రంగంలో వున్నారు.

ఎత్తిన తంబురా దించకుండా కథలు చెప్పిన ఆంధ్ర బుఱ్ఱ కథా పితామహ నాజర్ విషయం తీసుకుందాం. ఈయన బుఱ్ఱ కథల్లో పెద్ద తనాన్ని సంపాయించడం జరిగింది గాని, పెద్ద ధనాన్ని సంపాయించడం జరుగలేదు. ఇలాగే అన్ని దళాలు.

చివరికి చెప్పొచ్చే దేమిటంటే బుఱ్ఱ కథ దళాలు జనాకర్షణ విషయంలో ఎంత ఫార్వర్డుగా వున్నాయో, ధనాకర్షణ విషయంలో అంత బ్యాక్ వర్డుగా వున్నాయి.

దేశానికి అత్యవసర పరిస్థితి అప్పుడప్పుడు వచ్చిపోతుందిగాని, బుఱ్ఱకథ దళాలకు నిత్యావసర పరిస్థితి ఎప్పటి కప్పుడు హెచ్చి పోతుంటుంది. ప్రాణావసర వస్తువుల ధరల్లా! బమ్మెర పోతన్న, కలమొక చేత, హల మొక చేత పట్టాడు నిజమే. పొలముంటే హలము పట్ట డానికేం నిషేపంగా పట్టవచ్చు.

పోలమూ లేక ఏకాస్తో కూస్తో ఫలమూ లేక కలంపట్టి కవులు ఏంచేస్తారు ? ఏం భోంచేస్తారు ? ఏ కళాకారుడైనా సరే !

కనుక ప్రభుత్వం బుర్రకథ దళాలకు విధిగా సహకరించాలి. ఇది వెంటనే జరగాలి. జరగాలి అంటే పోష్టుపోన్ అవడం కాదు ! క్రియ వెంటనే అమలు కావాలి.

ఉత్తమ కళాకారులను ఉచితరీతిని సన్మానం చేయాలి. ఇది న్యాయమూ, ధర్మమూన్నూ. దళాలలో ఐక్యమత్యమే వుంటే యిది ఏనాడో జరిగేది. ఇకనైనా, ఇక పైన, ఇది పోష్టుపోన్ కాదని ఆశిద్దాం.

**బుఱ్ఱకథలు - ఉన్నత ప్రమాణాలు**

యక్షగాన సాంప్రదాయాలను తు. చ. తప్పకుండా పాటిస్తూ జానపద కళా విశిష్టతను ప్రతీకగా బుర్ర కథను నిలిపిన ఘనత ఆంధ్ర బుర్రకథా పితామహ నాజర్ కు దక్కుతుంది.

రాలు కరిగేలా, పూలు విరిసేలా,
రాగాలు విసరడంలో జూనియర్ నాజర్,
టీమ్ వర్కు అండ్ కాంబినేషన్ను
కు నిట్టలా బ్రదర్సు,
గానంతో గతానికి ప్రాణం పోయ
డం విషయంలో బెనర్జీ దళం,
తెలంగాణా నాజర్ అనిపించడంలో
వరంగల్ హనుమంత రాజు,

పౌరాణిక కథలనుచెప్పి ఉద్దండ పండితులను సైతం వొప్పించి మెప్పించడం విషయంలో శిష్టా సాంబశివరావు దళం.

గుమ్మెట వాయిద్యం విషయంలో నదీరా దళం మరియు మాస్టర్ పండు దళం.

'వంతలు ఇద్దరు! కంఠం ఒకటే!' అనిపించడంలో (కనకం—భీమరాజు) చందన కోటేశ్వరరావు దళం.

వంతలు ఎలా వున్నా ఒక్కడే కథను చెప్పి శెభాషనిపించడం విషయంలో లక్ష్మీకాంత మోహన్,

ఇంకా ఎందరో ఎన్నో ఉన్నత ప్రమాణాలను సాధించారు. ఎందరో మహానుభావులు! అందరికీ ప్రణామాలు!!

**ముగింపు! ముక్తాయింపు!**

గళాలు కలవని దళాలు కథలు చెప్పడం అనవసరం!

తప్పుడు తాళాలు కొట్టే వారు తంబురా ఢక్కీలను అక్కడ పెట్టి ప్రక్కకు తప్పుకోవడం మరీ ఉత్తమం.

చేవగల కలాలకు కొదువలేదు. కలంలో ఒలికించిన భావాలను గళంలో పలికించగల దళాలకు కొరతలేదు.

ఉజ్వలోజ్వల మగు కథలను, ఉత్తమోత్తమమగు దళాలచే రికార్డు చేయించి నట్లయితే కళాకారులు గతించినా - రికార్డ్సు దేశానికి మిగుల్తాయి! దేశస్థుల హృదయాలలో రివార్డ్సు కళాకారులకు చెందుతాయి! అందుతాయి! ఇందుకు ప్రజలు, ప్రభుత్వమూ పూనుకోవాలి. ఎంత ఖర్చయినా సరే ఇది జరగాలి.

ఇక 'ఈ బుర్ర కథల' ముగింపు బిగింపును ఇంపుగాను సొంపుగాను ఈ క్రింది ముక్తాయింపుతో పూర్తి చేద్దాం!

"బుర్ర కథలు వర్ధిల్లుగాక!"

— —

48

BCi

AOUA105B106

BC

తెలుగు సాంస్కృతిక సంవత్సరము 1975

## మనము ఫౌండేషన్ పుస్తకాల పరిశీలనాపత్రిక

| | |
|---|---|
| పుస్తకం సంఖ్య | AOUA105B106 |
| పుస్తకం పేరు | బుద్ధకథలు |
| తారీఖు | 31 December 2025 |
| ముందు అట్ట | yes |
| వెనుక అట్ట | yes |
| మొత్తం పేజీలు | 61 |
| పెద్ద సైజు పేజీలు | no |
| ఖాళీ పేజీలు | 4 8 |
| లేని పేజీలు | no |
| తయారు చేసినది | Kethana |
| పేజీలు విడదీసినది | Kethana |
| స్కాన్ చేసినది | Teja |
| పరీక్ష చేసినది | anusha |
| పేజీలు సరిచూసినది | |
| బైండింగు చేసినది | |
| స్కానింగు చేసినది | |
| పరిస్థితి | good |